
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
5 వరంగల్
శనివారం 13 జనవరి 2024

అ'విశ్వాస' రగడ!



- చైర్మన్, వైస్‌చైర్మన్లపై సొంత పార్టీ (బీఆర్ఎస్)వాళ్లే తిరుగుబావుట
- 'అవిశ్వాసాని'కే మొగ్గు చూపుతున్న కౌన్సిలర్లు
- మరో 8 నెలల్లో మునిసిపాలిటీ ఎన్నికలు
- బీఆర్ఎస్‌లో పెరిగిన అంతర్గత పోరు
- క్యాడర్‌లో గందరగోళం
- కాంగ్రెస్, బీఆర్ఎస్ చీకటి ఒప్పందాలు?
- ఆసక్తిగా మారిన రాజకీయ పరిణామాలు

వర్ధన్నపేట, నర్సంపేట మునిసిపాలిటీల్లో ముసలం

వరంగల్, జనవరి 12 (ఆంధ్రజ్యోతి): వరంగల్ జిల్లాలో 'అవిశ్వాస' రాజకీయాలు హీటెక్కిస్తున్నాయి. సొంత పార్టీకి చెందిన వారే చైర్మన్, వైస్ చైర్మన్‌ల పదవులకు ఎసరు పెడుతుండడంతో బీఆర్ఎస్ పార్టీ క్యాడర్ గందరగోళానికి గురవుతోంది. రాష్ట్రంలో అధికారం కోల్పోయిన నెల రోజుల వ్యవధిలోనే నియోజకవర్గ కేంద్రాలుగా ఉన్న వర్ధన్నపేట, నర్సంపేట మునిసిపాలిటీల్లో బీఆర్ఎస్ పార్టీలో ముసలం మొదలవడం జిల్లా వ్యాప్తంగా చర్చనీయాంశంగా మారింది. బీఆర్ ఎస్ జిల్లా అధ్యక్షుడు, వర్ధన్నపేట మాజీ ఎమ్మెల్యే అరూరి రమేష్ ఇలాకాలో కూడా తాజాగా అవిశ్వాస రాజకీయం తెరపైకి రావడంతో పార్టీ క్రమశిక్షణ తప్పు తోందనే సంకేతాలు వెళ్లి కిందిస్థాయి నాయకులను, కార్యకర్తలను అయోమయానికి గురి చేస్తున్నాయి. నోటీసులు అందించి కౌన్సిలర్లు చీకటి ఒప్పందాలను కుదుర్చుకుంటున్నారని, కాంగ్రెస్ పార్టీ కౌన్సిలర్లతో కలిసి బీఆర్ఎస్‌కు నష్టం చేస్తున్నారనే ప్రచారం జిల్లాలో జోరుగా సాగుతోంది. జిల్లాలో నర్సంపేట, వర్ధన్నపేట మునిసిపాలిటీలుండగా, రెండు చోట్లా బీఆర్ఎస్ పార్టీ చెందిన వారే చైర్మన్, వైస్ చైర్మన్లుగా ఉన్నారు. పార్టీలో ఉన్న అసమ్మతి, చైర్మన్,వైస్ చైర్మన్‌పై అసహనంతో ఆ పార్టీకి చెందిన కౌన్సిలర్లే అవిశ్వాస తీర్మాన నోటీసులు అందించడం చర్చనీయాంశమైంది.

జిల్లా అధ్యక్షుడి ఇలాఖాలో...

వరంగల్ జిల్లా బీఆర్ఎస్ అధ్యక్షుడు అరూరి రమేష్ వర్ధన్నపేట ఎమ్మెల్యేగా మొన్నటి వరకు వ్యవహరించారు. ఎమ్మెల్యేగా ఉన్నంత కాలం ఎలాంటి చప్పుడులేకుండా బీఆర్ఎస్ కౌన్సిలర్లు వ్యవహరించగా, తను మాజీ కావడంతో నెల రోజుల్లోనే కౌన్సిలర్లు మాట వినకుండా ఉండడంతో పార్టీలో అంతర్గత పోరు ప్రారంభమైనట్లుగా తెలుస్తోంది. బీఆర్ఎస్‌కు చెందిన కొందరు కౌన్సిలర్లు కాంగ్రెస్ పార్టీతో చీకటి ఒప్పందం చేసుకుని ఇదంతా నడిపిస్తున్నట్లుగా బీఆర్ఎస్ వర్గాలు అనుమానిస్తున్నాయి. అధ్యక్ష హోదాలో పార్టీని నడిపించే మాజీ ఎమ్మెల్యే రమేష్ ఇలాకాలోనే బీఆర్ఎస్ కౌన్సిలర్లు తిరుగుబావుట ఎగురవేయడంతో దీనిపై అధిష్ఠానం సీరియస్‌గా ఉన్నట్లు తెలుస్తోంది. దీనికి తోడు అవిశ్వాసం నోటీసు ఇచ్చేటప్పుడు కలెక్టర్ కార్యాలయానికి కాంగ్రెస్, బీజేపీకి చెందిన కౌన్సిలర్లతో కలిసి వెళ్లి నోటీసు ఇవ్వడంపై సర్వత్రా విమర్శలు వినిపిస్తున్నాయి. బీఆర్ఎస్‌లో ఇలాంటి ధోరణి సాగితే రాబోయే కాలంలో పార్టీకి నష్టం వాటిల్లుతుందని క్యాడర్ భావిస్తోంది.

చీకటి ఒప్పందాలు...

వర్ధన్నపేట, నర్సంపేట మునిసిపాలిటీ చైర్మన్‌లపై అవిశ్వాస నోటీసు ఇచ్చిన తర్వాత తదుపరి కార్యాచరణపై కౌన్సిలర్లు దృష్టి సారించారు. చైర్మన్, వైస్‌చైర్మన్లను ఎవరిని చేయాలనే విషయాలపై చర్చలు సాగిస్తున్నారు. దీనికోసం కాంగ్రెస్‌కు చెందిన కౌన్సిలర్లతో బీఆర్ఎస్ కౌన్సిలర్లు చీకటి ఒప్పందాలు చేసుకుంటున్నట్లు ప్రచారం సాగుతోంది. రెండు మునిసిపాలిటీల్లో కూడా మూడో వంతు కోరం లేకపోవడంతో ఇతర పార్టీ కౌన్సిలర్లను కాకా పట్టడంపై దృష్టి సారించారు. ఈ విషయంలో వర్ధన్నపేట మునిసిపాలిటీ ఒక అడుగు ముందుగానే ఉండగా, నర్సంపేటలో చర్చల దశలో ఉంది.

వర్ధన్నపేట బలాబలాలు..

వర్ధన్నపేట చైర్మన్, వైస్‌చైర్మన్ పదవి పొందాలంటే 12 మంది కౌన్సిలర్లలో 8 మంది కావాలి. మొత్తం 12 మందికి గాను, ఇప్పుడున్న చైర్మన్, వైస్‌చైర్మన్, ఓ మహిళా కౌన్సిలర్ అవిశ్వాసానికి వ్యతిరేకంగా ఉన్నారు. బీఆర్ఎస్‌లో ఆరుగురు కౌన్సిలర్లు ఉండగా, కాంగ్రెస్‌లో ఇద్దరు, బీజేపీ నుంచి ఒకరున్నారు. దీంతో ప్రస్తుతం అవిశ్వాసం నోటీసు ఇచ్చిన బీఆర్ఎస్ కౌన్సిలర్లకు కాంగ్రెస్ పార్టీ సహకారం అనివార్యంగా మారింది.

నర్సంపేటలో..

నర్సంపేటలో 24 వార్డులున్నాయి. అందులో 18 మంది బీఆర్ఎస్, ఆరుగురు కాంగ్రెస్‌కు చెందిన కౌన్సిలర్లు ఉన్నారు. చైర్మన్‌గా బీఆర్ఎస్‌కు చెందిన గుంటిరజినీ, వైస్ చైర్మన్ మునుగాల వెంకటరెడ్డిలు వ్యవహరిస్తున్నారు. ఈనెల 2న కలెక్టరేట్‌లో డీఆర్వో వాసుచంద్రకు అవిశ్వాస తీర్మాన నోటీసును 12మంది బీఆర్ఎస్ కౌన్సిలర్లు అందించారు. ఇక్కడ వైస్ చైర్మన్‌పై అవిశ్వాసం నోటీసు ఇవ్వలేదు. చైర్మన్‌పై మాత్రమే నోటీసు అందించారు. 12మంది అవిశ్వాసం నోటీసు ఇవ్వగా, ఇందులో 16 మంది మద్దతు ఉంటేనే చైర్మన్ తన పదవిని కోల్పోవాల్సి వస్తుంది. బీఆర్ఎస్ నుంచి 12 మంది మాత్రమే అవిశ్వాసం నోటీసు ఇవ్వగా, వారు అవిశ్వాసం నెగ్గాలంటే, మరో ఐదుగురికి సహకారం కావాలి. ఇక్కడ కూడా కాంగ్రెస్ నుంచి ఆరుగురు కౌన్సిలర్లు ఉన్నారు. దీంతో బీఆర్ఎస్, కాంగ్రెస్ మధ్య సయోధ్య కుదురుతుందా లేదా అనేది చూడాలి.

విశ్వాసం కోల్పోతున్న నేతలు...

తమకు ఓటేసి గెలిపిస్తే ప్రజల కోసం ఎంతో సేవ చేస్తామని, వార్డులను అన్ని రకాలుగా అభివృద్ధి చేస్తామని చెప్పి గెలిచిన నేతలు ఇప్పుడు ప్రజల్లో విశ్వాసాన్ని కోల్పోతున్నారు. మరో 8 నెలల్లో ఎన్నికలు ఉన్నప్పటికీ వార్డుల అభివృద్ధిపై దృష్టి సారించకుండా 'అవిశ్వాస' రాజకీయాలు చేస్తూ ప్రజలను పక్కదారి పట్టిస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. కాలనీల్లో సమస్యలపై ఏ ఉన్నతాధికారి దగ్గరకు వెళ్లిని ప్రజాప్రతినిధులు వారి స్వార్థ రాజకీయాల కోసం అధిష్ఠానం పెద్దలకు, పార్టీకి వ్యతిరేకంగా కలెక్టర్ కార్యాలయం మెట్లెక్కడంతో అసహనం వ్యక్తం చేస్తున్నారని చర్చించుకుంటున్నారు. రాష్ట్రంలో అధికారం కోల్పోవడంతో బీఆర్ఎస్‌లో లుకలుకలు బయటపడడం చర్చనీయాంశమైంది.

ముందే చెప్పిన 'ఆంధ్రజ్యోతి'..

మునిసిపాలిటీ అవిశ్వాస నోటీసులు, కాంగ్రెస్ బీఆర్ఎస్ పార్టీల చీకటి ఒప్పందాలను ఆంధ్రజ్యోతి ముందే చెప్పింది. వర్ధన్నపేట వ్యవహారంలో సైతం కాంగ్రెస్ వెనక నుంచి చక్రం తిప్పుతున్నట్లు వార్త కథనాలు ప్రచురించింది. వర్ధన్నపేట మునిసిపాలిటీలో అవిశ్వాసం నెగ్గితే, చైర్మన్‌గా పోటీ చేసేందుకు ఇద్దరు కౌన్సిలర్లు బరిలో ఉన్నారు. వీరిలో ఒక్క ఓటుతో స్వతంత్ర అభ్యర్థిగా గెలిచిన మహిళా కౌన్సిలర్ బీఆర్ఎస్ పార్టీలో చేరి ఓ వార్డుకు ప్రాతినిధ్యం వహిస్తుండగా, మరో మహిళా కౌన్సిలర్ పోటీ పడుతున్నారు. వీరిలో ఒకరు ఇప్పటికే పలువురి కౌన్సిలర్లకు చదివింపులు చేసుకోగా, మరొకరు ఆలోచనలో పడినట్లు తెలుస్తోంది. అయితే వీరిలో ఎవరనేది పక్కన పెడితే వీరు విశ్వాసం నెగ్గాలంటే కాంగ్రెస్ సహకారం కావాలి. దీంతో వైస్ చైర్మన్‌గా కాంగ్రెస్ కౌన్సిలర్‌కు ఇస్తేనే సహకరిస్తామని ఆ పార్టీ తేల్చి చెప్పడంతో వర్ధన్నపేటలో సర్వత్రా చర్చ సాగుతోంది. దీంతో కాంగ్రెస్ పార్టీకి మునిసిపాలిటీలో చోటిస్తే పార్టీకి తీవ్ర నష్టం జరిగే అవకాశం ఉందని బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు ఆందోళన చెందుతున్నారు.

హాస్టల్ గదిలో విద్యార్థిని ఆత్మహత్య

- మృతురాలు మంచిర్యాల జిల్లా అదనపు కలెక్టర్ కుమార్తె
- తేలని కారణాలు.. ఎన్నో అనుమానాలు..



రాథోడ్ దీప్తి (ఫైల్)

హసన్‌పర్తి, జనవరి 12: హనుమకొండ జిల్లాలోని ఓ ప్రైవేటు యూనివర్సిటీలో రాథోడ్ దీప్తి (20) అనే విద్యార్థిని గురువారం రాత్రి ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడింది. హసన్‌పర్తి ఇన్‌స్పెక్టర్ తుమ్మ గోపి తెలిపిన వివరాల ప్రకారం.. ఆదిలాబాద్ జిల్లాకు చెందిన దీప్తి బీఎస్సీ(అగ్రికల్చర్) సెకండ్ ఇయర్ చదువుతోంది. తండ్రి మోతీలాల్ నాయక్ మంచిర్యాల జిల్లా అదనపు కలెక్టర్‌గా పని చేస్తున్నారు.

ఇటీవలే ప్రథమ సంవత్సరం పరీక్ష ఫలితాలు వెలువడ్డాయి. అందులో కొన్ని సబ్జెక్ట్‌ల్లో దీప్తి ఫెయిల్ అయింది. అప్పటినుంచి ఆమె కొంత మనస్తాపంతో వున్నట్టు తెలుస్తోంది. సంక్రాంతి పండుగ నేపథ్యంలో దీప్తి గదిలో ఉండే తోటి విద్యార్థులు ఇళ్లకు వెళ్లిపోయారు. శుక్రవారం ఉదయం దీప్తి హాస్టల్ గది నుంచి బయటకు రాలేదు. దీంతో అనుమానంతో సిబ్బంది తలుపులు తెరిచి చూడగా, ఉరి వేసుకుని కనిపించింది. కళాశాల యాజమాన్యం సమాచారంతో పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకొని, మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఎంజీఎంకు తరలించారు. అనంతరం కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు.

అయితే దీప్తి ఆత్మహత్యకు గల కారణాలు స్పష్టంగా తెలియడం లేదు. పరీక్షల్లో ఫెయిల్ కావడం వల్ల అఘాయిత్యానికి ఒడిగట్టిందా? లేక ఇతర కారణాలేమైనా ఉన్నాయా? అనేది సస్పెన్సుగా మారింది. ఈ కోణాల్లోనే పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు. కాగా, కళాశాల యాజమాన్యం నిర్లక్ష్యంతోనే తన కూతురు ఆత్మహత్య చేసుకుందని దీప్తి తండ్రి మోతీలాల్‌నాయక్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఇన్‌స్పెక్టర్ తెలిపారు.

సమగ్ర విచారణ జరపాలి..

దీప్తి ఆత్మహత్యపై పోలీసులు సమగ్ర విచారణ జరపాలని తెలంగాణ విద్యార్థి పరిషత్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మేడ రంజిత్‌కుమార్, గిరిజన శక్తి రాష్ట్ర అధ్యక్షుడు గుగులోతు రాజునాయక్, టీఎస్ఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు కన్నం సునీల్, కన్నం అనిల్, విజయ్ డిమాండ్ చేశారు. యూనివర్సిటీ ఎదుట కొద్దిసేపు ధర్నా నిర్వహించారు. యూనివర్సిటీ గుర్తింపును రద్దు చేయాలని డిమాండ్ చేశారు.

వైద్య కళాశాలలకు నూతన సారథులు



డాక్టర్ భిక్షపతి రావు



డాక్టర్ రాజేంద్ర ప్రసాద్

హనుమకొండ అర్బన్, జనవరి 12: రాష్ట్ర ప్రభుత్వం నూతనంగా ఏర్పాటు చేసిన వైద్య కళాశాలలకు ప్రిన్సిపాళ్లను నియమిస్తూ వైద్య విద్య సంచాలకురాలు డాక్టర్ బి.త్రివేణి ఉత్తర్వులు జారీ చేశారు. రాష్ట్రంలోని ఎనిమిది కళాశాలలకు 2024-25 అకడమిక్‌కు ఈ నియామకాలు చేపట్టారు. హనుమకొండ కేఎంసీలోని జనరల్ మెడిసిన్ విభాగం ప్రొఫెసర్ డాక్టర్ రాజేంద్రప్రసాద్‌ను ములుగు వైద్య కళాశాల ప్రిన్సిపాల్‌గా, కేఎంసీ జనరల్ మెడిసిన్ ప్రొఫెసర్ డాక్టర్ ఎ.బిక్షపతిరావును నర్సంపేట వైద్య కళాశాల ప్రిన్సిపాల్‌గా నియమించారు.



అవార్డు చూపుతున్న ఎంజీఎం వైద్యులు

ఎంజీఎం ఆస్పత్రికి ప్లాటినం హోదా

హనుమకొండ అర్బన్, జనవరి 12: ఉత్తమ పనితీరు విభాగంలో వరల్డ్ స్ట్రోక్ సంస్థ భారత దేశం నుంచి వరంగల్ ఎంజీఎం ఆస్పత్రిని ఎంపిక చేసింది. ఈ అవార్డుతో ఎంజీఎం ఆస్పత్రి ప్లాటినం హోదాను అందుకుంది. బ్రెయిన్ స్ట్రోక్-త్రోంబోలిటిక్ థెరపీపై ఎంజీఎంలో అందిస్తున్న చికిత్సకు గాను ఈ అవార్డు దక్కింది. 2016లో ఈ సేవలు ఎంజీఎంలో ప్రారంభం అయ్యాయి. బ్రెయిన్ స్ట్రోక్ తర్వాత రోగిని నాలుగున్నర గంటలలోపు ఆస్పత్రికి తరలిస్తే ఈ చికిత్స సత్ఫలితాలు ఇస్తుందని వైద్యులు తెలిపారు. వరల్డ్ స్ట్రోక్ ఆర్గనైజేషన్ నుంచి అందుకున్న ఉత్తమ ప్రశంసల మెమోంటోను ఎంజీఎం ఆస్పత్రి జనరల్ మెడిసిన్ ఫ్యాకల్టీకి అంకితం ఇస్తున్నట్లు ఎంజీఎం సూపరింటెండెంట్ డాక్టర్ వి.చంద్రశేఖర్ తెలిపారు.

బాధ్యతలు చేపట్టిన ఆర్టీవో పాండురంగారావు



సంగెం, జనవరి 12: వరంగల్ ఆర్టీవోగా పాండురంగారావు శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. వరంగల్‌లోని రవాణా కార్యాలయంలో ఆయన బాధ్యతలు చేపట్టారు. అనంతరం కార్యాలయ ఉద్యోగులతో సమావేశం ఏర్పాటు చేసి పనుల కోసం కార్యాలయానికి వచ్చే వారితో గౌరవంగా మెలగాలని సూచించారు. ఈసందర్భంగా పాండురంగారావుకు ఉద్యోగులు శుభాకాంక్షలు తెలిపారు.



పిటీ.. క్లీన్‌సిటీ!

'స్వచ్ఛ సర్వేక్షణ్'లో దిగజారిన 'గ్రేటర్ వరంగల్' ర్యాంకు

- 2022లో 62.... ఇప్పుడు 101....
- టాప్ టెన్ ఆశలు గల్లంతు
- ప్రాసెసింగ్ యూనిట్లు, డంపింగ్ యార్డు సమస్యలే లోటు
- మసకబారుతున్న నగర ప్రతిష్ఠ

జీడబ్ల్యూఎంసీ(హనుమకొండ సిటీ), జనవరి 12: స్వచ్ఛ సర్వేక్షణ్-2023 పోటీల్లో గ్రేటర్ వరంగల్‌కు 101వ ర్యాంక్ లభించింది. నగరవాసులను ఈ ర్యాంక్ ఎంతగానో నిరాశపరిచింది. స్వచ్ఛ సర్వేక్షణ్ పోటీల్లోని దేశంలోని నగరాల ర్యాంక్‌లను కేంద్ర ప్రభుత్వ ఆధీనంలోని స్వచ్ఛ భారత్ మిషన్ శుక్రవారం ప్రకటించింది. దేశంలో ఇండోర్ వరుసగా 7వ సారి ప్రథమ ర్యాంక్‌ను సొంతం చేసుకుంది. దేశవ్యాప్తంగా 101వ ర్యాంక్‌లో నిలిచిన గ్రేటర్ వరంగల్ తెలంగాణ రాష్ట్రపరంగా పరిశీలిస్తే 5వ స్థానంలో నిలిచింది.

దిగజారిన ర్యాంక్

2022 పోటీల్లో గ్రేటర్ వరంగల్ 62వ ర్యాంక్‌ను సాధించింది. ఈ సారి అంతకంటే మెరుగైన ర్యాంక్ సాధిస్తుందన్న ఆశలు అడియాశలు అయ్యాయి. ఒక విధంగా టాప్‌టెన్‌పై బల్దియా గురి పెట్టింది. కానీ ఆ దిశగా కార్యాచరణ లేకపోవడంతో గతంలోని 62 స్థానానికంటే దిగజారి 101 ర్యాంక్‌ను పొందింది.

మసకబారుతున్న ఇమేజ్

ఒకప్పుడు దేశంలోనే క్లీన్‌సిటీగా నెంబర్‌వన్ స్థానంలో నిలిచిన గ్రేటర్ వరంగల్ క్రమంగా ఆ ప్రతిష్ఠను కోల్పోతోంది. 2015లో దేశంలోనే 33వ ర్యాంక్‌ను సొంతం చేసుకొని పర్వాలేదనిపించింది. ఆ తరువాత 32, 28, 31 స్థానాల్లో వరుసగా నిలిచింది. 2020లో 144వ ర్యాంక్‌తో గ్రేటర్ వరంగల్ అపఖ్యాతిపాలైంది. ఆ తరువాత ఇదే పరిస్థితి. చివరకు 2022లో 62వ స్థానంలో నిలిచి కొంతైనా ప్రతిష్ఠను కాపాడుకుంది. ఈసారి మాత్రం ఏకంగా 101వ ర్యాంక్‌ను సాధించడం మాత్రం నగరానికి మచ్చగా పరిణమించింది.

ప్రాసెసింగ్ యూనిట్ల కొరత

స్వచ్ఛ సర్వేక్షణ్ పోటీల్లో నగర వెనకబాటుకు తొలినుంచి ఒకే ఒక కారణం ప్రాసెసింగ్ యూనిట్ల కొరత. యేటా ఈ లోటే నగరానికి మెరుగైన ర్యాంక్ దక్కకుండా చేస్తోంది. ఐదేళ్లుగా ఇదే అనుభవం ఎదురవుతోంది. బల్దియా మాత్రం ఈలోటును పూడ్చడంలో శ్రద్ధచూపడం లేదు. ప్రాసెసింగ్ యూనిట్ల సమకూర్చుపై దృష్టి పెట్టడం లేదు. యేటా వచ్చేసారి పోటీల్లో టాప్ టెన్‌లో ఉండేలా చర్యలు చేపడతామని చెప్పడమే తప్ప ఆచరణలో విఫలమవుతోంది. ఈ క్రమంలో ఈ సారి కూడా జరిగింది ఇదే.

ప్రాసెసింగ్ యూనిట్ల లోటే..

స్వచ్ఛసర్వేక్షణ్ పోటీల్లో గ్రేటర్ వరంగల్ 8 కేటగిరిలో ఆరింట్లో మెరుగైన శాతాన్ని సాధించింది. ఇంటింటి చెత్తసేకరణలో 99 శాతం, తడి, పొడి చెత్త విభజనలో 97 శాతం, నివాసిత ప్రాంతాలు, మార్కెట్ ఏరియాలు, తాగునీటి వనరులు, పబ్లిక్ టాయిలెట్ల పరిశుభ్రత నిర్వహణలో వంద శాతం మార్కులను నగరం సాధించింది. చెత్తను ఇతరరూపంలోకి మార్చే ప్రాసెసింగ్, డంపింగ్ యార్డుల్లోని చెత్త నిర్వహణ అంశాల్లో మాత్రం బల్దియా 51, 36 శాతం మార్కులనే సాధించింది. ఇక్కడే నగరానికి మెరుగైన ర్యాంక్ దక్కకుండా పోయింది. మడికొండ డంపింగ్ యార్డులో చెత్త కొండలుగా పేరుకుపోయింది. కొన్నేళ్లుగా ఈ సమస్య వేధిస్తోన్న ప్రాసెస్ చేయడంలో ప్రాజెక్టులను ఏర్పాటు చేయడంలో బల్దియా విఫలమైంది.

ఈసారి అందుబాటులోకి..

గ్రేటర్ వరంగల్‌కు 101వ ర్యాంక్ లభించడంలో బల్దియా అధికారగణం అనేక కారణాలు చెబుతోంది. గతంలో కార్పొరేషన్లు కాకుండా మునిసిపాలిటీలు కూడా పోటీల్లో పాల్గొనడంతో కేటగిరిలో పెరగడం కూడా ర్యాంక్ కారణంగా చెబుతున్నారు. అయితే అధికారులు చెప్పే కారణాలు సహేతుకంగా లేవనేది స్పష్టమవుతోంది. ఇండోర్ నగరం వరుసగా ఏడుసార్లు నెంబర్ వన్‌గా నిలవడమే ఇందుకు ఉదంతంగా చెప్పవచ్చు.

2024 పోటీల్లో మాత్రం నగరం మెరుగైన ర్యాంక్ సాధిస్తుందనే అంచనాలు అధికారుల్లో ఉన్నాయి. ఇందుకు కారణం ఎస్‌టీపీలు అందుబాటులోకి రానుండడం, అమ్మవారిపేటలోని 150 కేఎల్‌డీ సామర్థ్యంగల మరో ప్లాంట్ నిర్మాణం, మడికొండ డంపింగ్ యార్డులో ప్రాసెసెంట్ యూనిట్ ఏర్పాటు అవుతుండడమే ర్యాంక్ దక్కిస్తుందనే అంచనాలతో బల్దియా ఉంది.

పోదాం పద జాతర..

- ముస్తాబైన ఐనవోలు
- నేడు ధ్వజారోహణం... రేపు భోగి..
- మల్లన్న చెంతకు పోటెత్తనున్న భక్తులు

ఐనవోలు, జనవరి 12: మల్లన్న జాతరకు ఐనవోలు ముస్తాబైంది. శనివారం ధ్వజారోహణతో జాతర ఉత్సవాలు ప్రారంభమై ఉగాది వరకు కొనసాగడం ఈ ఆలయ విశిష్టత. 14న భోగి, 15 మకర సంక్రాంతిని పురస్కరించుకుని రాష్ట్రం నలుమూలల నుంచి వేలాదిగా భక్తులు తరలివచ్చి స్వామివారిని దర్శించుకొని మొక్కులు చెల్లించుకుంటారు. దేవాదాయ, ధర్మాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ, ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు, కలెక్టర్ సిక్తా పట్నాయక్ జాతర నిర్వహణ ఏర్పాట్లపై సమీక్ష జరిపి సౌకర్యాలు కల్పించారు. ఎట్టకేలకు జాతరలో నీటి సరఫరాపై ప్రత్యేక దృష్టి సారించి పర్యవేక్షణ బృందాన్ని ఏర్పాటు చేశారు. మిషన్‌భగీరథ నీటిని సరఫరా చేస్తున్నారు. భక్తులు స్నానాలు చేసేందుకు బ్యాటరీ ఆఫ్ ట్యాప్స్‌ను ఆరు చోట్ల ఏర్పాటు చేశారు. మహిళలు దుస్తులు మార్చుకునేందుకు ఏడు చోట్ల డ్రెస్సింగ్ రూమ్‌లు ఏర్పాటు చేశారు. ప్రాంగణంలో మూడు చోట్ల మరుగుదొడ్లను సులభ్ కాంప్లెక్స్‌కు అప్పగించారు. విద్యుత్తు సరఫరాలో అంతరాయం కలగకుండా సబ్‌స్టేషన్ నుంచి ప్రత్యేక ఫీడర్ ద్వారా ట్రాన్స్‌ఫార్మర్‌లు ఏర్పాటు చేశారు. జీడబ్ల్యూఎంసీ, పంచాయతీ రాజ్ శాఖ, దేవస్థానం నుంచి 300మంది కార్మికులు పారిశుధ్య నిర్వహణను చేపట్టనున్నారు.

పోలీస్ కమాండ్ కంట్రోల్ రూమ్

పోలీసులు కమాండ్ కంట్రోల్ రూమ్‌ను ఏర్పాటు చేసి బందోబస్తును పర్యవేక్షిస్తున్నారు. జాతర పార్కింగ్ స్థలాలను ఖరారు చేసి రూట్‌మ్యాప్ ను విడుదల చేశారు. 10 చెక్‌పోస్టులు, 150 సీసీ కెమెరాలు, ప్రత్యేక గస్తీ, నిఘా బృందం, షీ టీమ్‌లు పని చేయనున్నాయి.

డ్రోన్ కెమెరాతో ట్రాఫిక్‌ను పర్యవేక్షించనున్నారు. మామునూరు ఏసీపీ సతీష్‌బాబు, పర్వతగిరి సీఐ అనుముల శ్రీనివాస్, ఎస్సై జి.అనిల్‌కుమార్ నేతృత్వంలో 400 పైచిలుకు మంది పోలీసు అధికారులు, సిబ్బంది విధులు నిర్వహిస్తున్నారు.



మల్లికార్జునస్వామి

15 మందితో ఉత్సవ కమిటీ

- పదవీ కాలం వారం రోజులే..

ఐనవోలు జాతర వేళ అధికారులు ఉత్సవ కమిటీని ప్రకటించారు. ఈ మేరకు దేవాదాయ ధర్మాదాయ శాఖ కమిషనర్ వి.అనిల్‌కుమార్ శుక్రవారం ఉత్తర్వులు జారీ చేశారు. కమిటీలో మొత్తం 15 మంది సభ్యులను నియమించారు. కమిటీకి చైర్మన్ ఉండరు. ఈ కమిటీ పదవీకాలం ఈ నెల 12 నుంచి 18 వరకు కేవలం 7 రోజులే ఉంటుందని పేర్కొన్నారు. కమిటీలో సభ్యులుగా ఎద్దు సత్యనారాయణ, పోలేపల్లి బుచ్చిరెడ్డి, మార్నేని వెంకటేశ్వర్‌రావు, నునావత్ కీమానాయక్, మజ్జిగ రాములు, గడ్డం శ్రీనివాస్, జెట్టబోయిన శ్రీనివాస్, కొండేటి మమత, ఒగ్గుల మాధవి, తాటికొండ కృష్ణమూర్తి, చెరుకొండ వెంకటేశ్వర్లు, కూస చిరంజీవి, నాగబెల్లి మహేందర్, గురుమంచి వేణుగోపాలచారి(దాత), పాతర్లపాటి రవీందర్ (ఉప ప్రధాన అర్చకుడు) నియమితులయ్యారు.

విద్యార్థుల

సృజనకు పదును

- ఆన్‌లైన్‌లో ఇన్‌స్పైర్ మనక్ పోటీలు
- ఈ నెల 18 వరకు ప్రాజెక్టుల అప్‌లోడ్
- హనుమకొండ జిల్లాలో 103 ప్రాజెక్టుల ఎంపిక



ఇన్‌స్పైర్ మనక్ లోగో

హనుమకొండ రూరల్, జనవరి 12: విద్యార్థుల్లో సృజనాత్మకతను వెలికి తీసే సమయం ఆసన్నమైంది. వారిని ప్రయోగాల వైపు మళ్లించి భావిభారత శాస్త్రవేత్తలుగా తయారు చేయాలనే లక్ష్యంతో కేంద్ర ప్రభుత్వం ముందుకు వెళుతోంది. ఇందులో భాగంగా అన్ని యాజమాన్యాల పాఠశాలల్లో 10 నుంచి 15 ఏళ్ల వయస్సు గల 6 నుంచి 10వ తరగతి చదువుతున్న విద్యార్థుల మేధస్సుకు పదును పెడుతోంది. ప్రధానమంత్రి కలల ప్రాజెక్టు స్టార్టప్ ఇండియా దిశగా తీర్చిదిద్దేందుకు ఏర్పాట్లు చేసింది. ప్రయోగాలు, ఆవిష్కరణలు, కొత్త ఆలోచనల దిశగా 2022-23 విద్యా సంవత్సరానికి ఇన్‌స్పైర్ మనక్ కార్యక్రమాన్ని దేశవ్యాప్తంగా అన్ని పాఠశాలల్లో నిర్వహిస్తోంది. ప్రాజెక్టుల తయారీ కోసం ప్రతి విద్యార్థికి రూ.10వేల చొప్పున వారి బ్యాంకు ఖాతాల్లో జమ చేశారు. హనుమకొండ జిల్లాలో 103 ప్రాజెక్టులు ఎంపికయ్యాయి. ఈ ప్రాజెక్టుల ప్రదర్శన ఈసారి ఆన్‌లైన్ వేదికగా నిర్వహించనున్నారు.

ఆన్‌లైన్‌లో ఇన్‌స్పైర్ మనక్ పోటీలు

ఆన్‌లైన్ ప్రత్యేక యాప్ ద్వారా ప్రాజెక్టుల ప్రదర్శనకు ఏర్పాట్లు చేశారు. ఈ నెల 18వ తేదీ వరకు జిల్లాస్థాయి పోటీల కోసం యాప్‌లో ప్రాజెక్టుల వివరాలు అప్‌లోడ్ చేయాల్సి ఉంటుంది. 19వ తేదీ నుంచి 25వ తేదీ వరకు మూల్యాంకనం చేసి 26న రాష్ట్రస్థాయిలో జరిగే పోటీలకు ప్రాజెక్టులను ఎంపిక చేసి ప్రకటిస్తారు. 26 నుంచి 31వ తేదీ వరకు రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైన విద్యార్థులు యాప్‌లో ప్రాజెక్టుల వివరాలు అప్‌లోడ్ చేయాలి. ఫిబ్రవరి 1 నుంచి 3 వరకు మూల్యాంకనం చేసిన అనంతరం జాతీయస్థాయిలో జరిగే పోటీల్లో పాల్గొనే వి ద్యార్థుల జాబితాను విడుదల చేస్తారు.

అప్‌లోడ్ ఇలా..

ఫోన్‌లోని గూగుల్ ప్లేస్టోర్ నుంచి ఇన్‌స్పైర్ మనక్ కాంపిటీషన్ యాప్ డౌన్‌లోడ్ చేసుకోవాలి. తర్వాత ప్రాజెక్టుకు ఎంపికైన విద్యార్థి రిజిస్ట్రేషన్, ఓటీపీ, పాస్‌వర్డ్ ఎంటర్ చేసి లాగిన్ కావాల్సి ఉంటుంది. విద్యార్థి పేరు, పాఠశాల పేరు, ప్రాజెక్టు విషయాలు కనిపించగానే వాటిని ఒకసారి సరిచూసుకొని ముందుకు వెళ్లాలి. ఆ తర్వాత అప్‌లోడ్ చేసి ప్రాజెక్టుకు సంబంధించిన వీడియో, ఆడియో, ఫొటోలను నమోదు చేయాలి. వీడియో 2 నిమిషాలు ఉండి 30 ఎంబీ దాటకూడదు. ఫొటోలు నాలుగు వరకే నమోదు చేయాలి. దీంతోపాటు వాయిస్ రికార్డులో ప్రయోగ వివరణ ఇవ్వాలి. వివరాలు అన్ని సరిచూసుకొని సబ్మిట్ ఎంట్ చేయాలి.

అప్‌లోడ్ చేయడంలో జాగ్రత్తలు తీసుకోవాలి



ఎస్.శ్రీనివాసస్వామి, జిల్లా సైన్స్ అధికారి

ఇన్‌స్పైర్ మనక్ పోటీలను ఈసారి ఆన్‌లైన్‌లో నిర్వహిస్తున్నందున ప్రాజెక్టుల అప్‌లోడ్ చేయడంలో జాగ్రత్తలు తీసుకోవాలి. పోటీల సూచనలను చక్కగా చదువుకొని అర్థం చేసుకొని అప్‌లోడ్ చేయాలి. ఈ నెల 18వ తేదీ వరకు జిల్లాస్థాయి పోటీల కోసం యాప్‌లో ప్రాజెక్టుల వివరాలు అప్‌లోడ్ చేయాలి. సందేహాల నివృత్తి కోసం 9490112848 సెల్ నెంబరులో సంప్రదించవచ్చు.

భావి శాస్త్రవేత్తలుగా ఎదిగేందుకు దోహదం



అబ్దుల్‌హై, డీఈవో

విద్యార్థులను పాఠశాలల స్థాయిలోనే శాస్త్రవేత్తలుగా తీర్చిదిద్దాలి. వారిలో దాగి ఉన్న సృజనాత్మకతకు పదునుపెట్టాలి. ఇన్‌స్పైర్ మనక్ ప్రదర్శనతో విద్యార్థుల్లోని ప్రతిభను వెలికి తీయడంవల్ల భావి శాస్త్రవేత్తలుగా ఎదిగేందుకు దోహద పడుతుంది. జిల్లా నుంచి ఎంపికైన విద్యార్థులతో ఉత్తమ ప్రాజెక్టులను తయారు చేయించడానికి గైడ్ టీచర్లు కృషి చేయాలి.

ఉజ్వల భవిష్యత్‌కు 'నవోదయం'



మామునూరు జవహర్ నవోదయ విద్యాలయం

ఆరో తరగతి నుంచి ఇంటర్ వరకు కార్పొరేట్ స్థాయి విద్య

- గ్రామీణ ప్రాంత విద్యార్థులకు వరం
- ఈనెల 20న ప్రవేశ పరీక్ష.. ఏర్పాట్లు పూర్తి
- ఉమ్మడి వరంగల్ జిల్లాలో 26 పరీక్షా కేంద్రాలు

జఫర్‌గఢ్, జనవరి 12: అ త్యున్నత ప్రమాణాలతో కూడిన ఆ ధునిక విద్యనందిస్తూ విద్యార్థులను ఉత్త మ విలువలతో కూడిన పౌరులుగా తీర్చిదిద్దుతూ మన్ననలు అందుకుంటోంది ఉమ్మడి వరంగల్ జిల్లా మామునూరులోని జవహర్ నవోదయ విద్యాలయం. ఇందులో కార్పొరేట్ విద్యా సంస్థలకు దీటుగా గ్రామీణ ప్రాంత విద్యార్థులకు ఉచితంగా విద్యనందిస్తూ అన్ని సౌకర్యాలను కల్పిస్తున్నారు. 6వ తరగతిలో ప్రవేశం పొందిన విద్యార్థికి ఇంటర్ మీడియట్ వరకు సీబీఎస్ఈ సిలబస్ ప్రకారం విద్యనందిస్తున్నారు. 2024-25 విద్యా సంవత్సరానికి 6వ తరగతిలో ప్రవేశాల కోసం ఈనెల 20న ప్రవేశ పరీక్షను నిర్వహించబోతున్నారు.

జిల్లాల వారీగా పరీక్ష కేంద్రాలు, విద్యార్థులు

ఉమ్మడి వరంగల్‌లోని ఆరు జిల్లాలతో పాటు సిద్ధిపేట జిల్లాలో పరీక్ష కేంద్రాలు, ప్రవేశ పరీక్షకు హాజరుకాబోయే అభ్యర్థుల వివరాలను నవోదయ ప్రిన్సిపాల్ బి.పూర్ణిమ వెల్లడించారు. జనగామ జిల్లాలో 3 పరీక్ష కేంద్రాల్లో 674 మంది, మహబూబాబాద్ జిల్లాలో 5 పరీక్ష కేంద్రాల్లో 1,162 మంది. ములుగు జిల్లాలో 3 పరీక్ష కేంద్రాల్లో 521 మంది, జయశంకర్ భూపాలపల్లి జిల్లాలో ఒక పరీక్ష కేంద్రంలో 238 మంది, వరంగల్ జిల్లాలో 9 పరీక్ష కేంద్రాల్లో 2,082 మంది, హన్మకొండ జిల్లాలో 4 పరీక్ష కేంద్రాల్లో 837 మంది. సిద్ధిపేట జిల్లాలో ఒక పరీక్ష కేంద్రంలో 124 మంది చొప్పున మొత్తం 26 పరీక్ష కేంద్రాల్లో, 5,638 మంది అభ్యర్థులు పరీక్ష రాయనున్నారు.

ప్రవేశ పరీక్ష విధానం

ఈనెల 20వ తేదీ శనివారం ఉదయం 11-30 నుంచి మధ్యాహ్నం 1-30 గంటల వరకు ఉమ్మడి వరంగల్‌లోని ఆరు జిల్లాలతో పాటు సిద్ధిపేటలో ఏర్పాటు చేసిన 26 కేంద్రాల్లో పరీక్షలు జరగనున్నాయి. ప్రశ్నలన్నీ ఆబ్జెక్టివ్ రూపంలో ఉంటాయి. మొత్తం రెండు గంటల వ్యవధిలో 100 మార్కులకు.. మూడు విభాగాల్లో పరీక్ష నిర్వహిస్తారు. ఇందులో మేధాశక్తి పరీక్షలో 50 మార్కులతో కూడిన 50 ప్రశ్నలు (60 నిమిషాల సమయం), గణితం విభాగంలో 25 మార్కులతో కూడిన 25 ప్రశ్నలు (30 నిమిషాల సమయం), భాషా విభాగంలో 25 మార్కులతో కూడిన 25 ప్రశ్నలు (30 నిమిషాల సమయం) చొప్పున ఉంటాయి. ప్రశ్నలకు సమాధానాలు ఐసీఆర్/ఓసీఆర్ షీట్లలో అంకెల రూపంలో గుర్తించాలి. నెగెటివ్ మార్కులు ఉండవు.

అభ్యర్థులు గుర్తుంచుకోవాల్సిన అంశాలు

పరీక్షలు రాసేవారందరూ చిన్నారులే కావడంతో ఓసీఆర్ షీట్లలో సమాధానాలు గుర్తించాల్సి ఉండడంతో తడబాటు ఉంటుంది. అది పోవాలంటే కింది అంశాలను గుర్తుంచుకోవాలని నిపుణులు సూచిస్తున్నారు.

- సమాధానాలు గుర్తించడానికి నీలి లేదా నలుపు (బ్లూ, బ్లాక్) బాల్ పెన్ను మాత్రమే వినియోగించాలి.
- ఒక్కసారి సమాధానం రాసిన తరువాత మార్చుట, కొట్టివేయుట, దిద్దడం చేయకూడదు.
- ఒక ప్రశ్నకు సుమారు ఒక నిమిషం పడుతుంది. అందువల్ల ఒక్క ప్రశ్న గురించి ఎక్కువ సమయం తీసుకోకూడదు. దానిని వదిలి మరో ప్రశ్నకు జవాబు రాసే ప్రయత్నం చేయాలి. దీని వల్ల సమయం ఆదా తగ్గుతుంది. అన్ని ప్రశ్నలకు జవాబులు గుర్తించాక.. నెగిటివ్ మార్కులు ఉండవు కాబట్టి వదిలివేసిన ప్రశ్నలుంటే అపుడు వాటిని ఆలోచించి సమాధానాలు గుర్తించాలి.
- బుక్‌లెట్‌లో గల మూడు విభాగాల్లో అభ్యర్థులు ఉత్తీర్ణులు కావాల్సిందే. అందువల్ల అవసరానికి మించిన సమయం ఒక్కో విభాగంపై వృథా చేయరాదు.
- ప్రతి 30 నిమిషాలకు ఒకసారి బెల్ కొడతారు. అది గమనించి పరీక్ష రాయాలి.
- పరీక్షకు గంట సమయం ముందే ఆయా పరీక్ష కేంద్రాలకు చేరుకోవాలి.

18న పరీక్ష నిర్వాహకులకు శిక్షణ

నవోదయ ప్రవేశ పరీక్ష నిర్వహణలో విధులు నిర్వహించే 26 మంది పరీక్ష కేంద్రాల పర్యవేక్షకులు, 26 మంది పరిశీలకులు, రూట్ అధికారులకు ఈనెల 18వ తేదీన మామునూరులోని నవోదయ విద్యాలయంలో శిక్షణ ఇవ్వనున్నారు. పారదర్శక పరీక్ష విధానం, పరిశీలన, పర్యవేక్షణ, నియమ నిబంధనలు వంటి అంశాలపై అవగాహన కల్పిస్తారు. పరీక్ష సక్రమ నిర్వహణకు తీసుకోవాల్సిన జాగ్రత్త చర్యలపై వివరించనున్నారు.

పరీక్ష నిర్వహణకు ఏర్పాట్లు పూర్తి

బి.పూర్ణిమ, ప్రిన్సిపాల్, మామునూరు నవదోయ విద్యాలయం



ప్రవేశ పరీక్షను పారదర్శకంగా నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశాం. ఉమ్మడి వరంగల్‌లోని ఆరు జిల్లాలతో పాటు సిద్ధిపేట జిల్లాల్లో 26 పరీక్ష కేంద్రాలు ఏర్పాటు చేశాం. ఏడు జిల్లాల పరిధిలోని మొత్తం 5,638 మంది విద్యార్థులు దరఖాస్తు చేసుకున్నారు. అభ్యర్థులు తమ హాల్ టికెట్లను ఆన్‌లైన్ ద్వారా డౌన్‌లోడ్ చేసుకోవాలి. రిజర్వేషన్, ప్రతిభ ఆధారంగా సీట్ల కేటాయింపు ఉంటుంది. విద్యార్థులు ఆయా పరీక్ష కేంద్రాలకు గంట సమయం ముందే చేరుకోవాలి. ఆఫ్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకున్న అభ్యర్థుల్లో ఎవరికేని హాల్ టికెట్ అందని పక్షంలో మామునూరు నవోదయ విద్యాలయంలో లేదా హెల్ప్‌లైన్ నంబరు 7780408933కు సంప్రదించాలి.

సీపీని కలిసిన ములుగు ఎస్పీ

హనుమకొండ క్రైం, జనవరి 12: ములుగు ఎస్పీగా నూతనంగా బాధ్యతలు చేపట్టిన డాక్టర్ శబరీష్ శుక్రవారం వరంగల్ సీపీ అంబర్ కిశోర్ ఝాను కలిశారు. సీపీ కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిసి పూల మొక్కను అందించారు. ములుగు ఎస్పీకి సీపీ శుభాకాంక్షలు తెలిపారు. ఇద్దరు అధికారులు శాంతిభద్రతల పరిరక్షణపై కాసేపు మాట్లాడుకున్నారు.



సీపీకి పూల మొక్కను అందిస్తున్న ములుగు ఎస్పీ

హేమాచలుడి హుండీ ఆదాయం రూ.7 లక్షలు



హేమాచల లక్ష్మీనర్సింహస్వామి ఆలయంలో హుండీలలో భక్తులు వేసిన కానుకలను లెక్కిస్తున్న అర్చక, ఉద్యోగులు

మంగపేట, జనవరి 12: మండలంలోని మల్లూరు హేమాచల లక్ష్మీనర్సింహస్వామి దేవస్థానంలో హుండీల్లో భక్తులు వేసిన కానుకలను శుక్రవారం లెక్కించారు. ఆలయ ప్రాంగణంలోని కల్యాణ మండపం వద్ద ఎండోమెంట్ పరకాల డివిజన్ ఇన్‌స్పెక్టర్ ధరణికోట అనిల్‌కుమార్ పర్యవేక్షణలో గత సెప్టెంబరు 30 నుంచి 2024 జనవరి 11 వరకు భక్తులు వేసిన కానుకలను బందోబస్తు మధ్య లెక్కించారు. మొత్తం ఏడు హుండీల ఆదాయం రూ.7,14,437 ఆదాయంతో పాటు వెండి, కొన్ని రెండు వేల నోట్లు, ఇతర మొక్కులు సమకూరాయని ఈవో శ్రవణపు సత్యనారాయణ, చైర్మన్ నూతల కంటి ముకుందం, ప్రధానార్చకులు కైంకైర్యం రాఘవాచార్యులు, ఎం.రాజశేఖరశర్మలు వెల్లడించారు. కార్యక్రమంలో ఆలయ అర్చకులు పవన్‌కుమారచార్యులు, ఈశ్వర్ చంద్‌శర్మ, వెంకటనారాయణశర్మ, మురళీకృష్ణశర్మ, రాజీవ్ నాగశర్మ, ఉద్యోగులు సీతారాములు, సుధీర్, వలంటీర్లు పాల్గొన్నారు.

లైంగిక దాడి కేసులో ఒకరికి పదేళ్ల జైలుశిక్ష

వాజేడు, జనవరి 12: లైంగిక దాడి కేసులో ముద్దాయికి ములుగు జిల్లా కోర్టు పదేళ్ల జైలు శిక్ష విధించింది. వివరాలిలా ఉన్నాయి. 2021లో మండలంలోని ఓ గ్రామానికి చెందిన మహిళపై వెంకటాపురం మండలం మహితాపురంకు చెందిన గొంది శ్రీకాంత్ లైంగిక దాడికి పాల్పడ్డాడు. వాజేడు పోలీస్‌స్టేషన్‌లో బాధితురాలి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్న అప్పటి సీఐ శివప్రసాద్, ఎస్సై ఎస్.రాము నిందితుడిపై చార్జిషీట్ దాఖలు చేశారు. ప్రస్తుత సీఐ బండారి కుమార్, ఎస్సై వెంకటేశ్వరరావుల పర్యవేక్షణలో సాక్ష్యులను కోర్టులో ప్రవేశపెట్టగా ప్రిన్సిపల్ డిస్ట్రిక్ట్ అండ్ సెషన్స్ జడ్జి పి.లలితశివజ్యోతి సదరు ముద్దాయికి పదేళ్ల జైలుశిక్షతో పాటు రూ.18వేలు జరిమానా విధిస్తూ శుక్రవారం తీర్పును వెలువరించారు. ఈ కేసును అడిషనల్ పీపీ సీహెచ్.సత్యనారాయణ వాదించగా, కోర్టు లైజన్ ఆఫీసర్ కమలాకర్, కోర్టు కానిస్టేబుల్ నాగరాజు పాల్గొన్నారు.



పర్వతాన్ని అధిరోహిస్తున్న సతీష్

కిలిమంజారో పర్వతాన్ని అధిరోహించిన యువకుడు

చెన్నారావుపేట, జనవరి 12: ఆఫ్రికా ఖండంలోనే అత్యంత ఎత్తైన కిలిమంజారో పర్వతాన్ని ఓ యువకుడు అధిరోహించాడు. మండలంలోని పాత ముగ్ధుంపురం గ్రామానికి చెందిన ఇల్లా సతీష్ అనే యువకుడు ఆఫ్రికా దేశంలోని ఓ కంపెనీలో పని చేస్తున్నాడు. అక్కడే రాక్ క్లయింబింగ్‌ను నేర్చుకున్నాడు. ఈనెల 8న పై 5,895 మీటర్ల ఎత్తున్న కిలీమంజారో పర్వత్వాన్ని నాలుగు రోజులు శ్రమించి ఎక్కాడు. కాగా, ఈవిషయాన్ని శుక్రవారం గ్రామస్థులు తెలిపారు. ఎంతో సాహసంగా పర్వతాన్ని అధిరోహించడం ఆనందంగా ఉందని పేర్కొన్నారు. గతంలోనూ జంగి జంప్‌లో భాగంగా ప్రయాణిస్తున్న విమానం నుంచి ప్యారాచూట్‌తో జంప్ చేసినట్టు పేర్కొన్నారు. గత సంవత్సరం 5,364 మీటర్ల ఎత్తులో ఉన్న మౌంట్ ఎవరెస్టును ఎక్కి బేస్ క్యాంపును అధిరోహించాడు.

విద్యాభివృద్ధికి ప్రభుత్వం చర్యలు తీసుకోవాలి

డీటీఎఫ్ అకడమిక్ సెల్ కన్వీనర్ బి.రామకృష్ణ

హనుమకొండ రూరల్, జనవరి 12: సమాజంలోని అంతరాలు తొలగిపోవాలంటే విద్యనే సరైన సాధనమని, అందుకు నూతన ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని డీటీఎఫ్ అకడమిక్ సెల్ కన్వీనర్ బి.రామకృష్ణ అన్నారు. శుక్రవారం హనుమకొండలలోని పెన్షనర్స్ అసోసియేషన్ కార్యాలయంలో డెమోక్రటిక్ టీచర్స్ ఫెడరేషన్ (డీటీఎఫ్) ఆధ్వర్యంలో విద్యా సదస్సు జరిగింది. ఈ సందర్భంగా బి.రామకృష్ణ మాట్లాడుతూ.. ప్రభుత్వం ఇటీవల ప్రవేశపెట్టిన కార్యక్రమాల ద్వారా ఉపాధ్యాయులపై ఒత్తిడి పెరుగుతుందే కానీ..



మాట్లాడుతున్న రామకృష్ణ

ఆశించిన ఫలితాలు రావడం లేదన్నారు. ఇప్పటికైనా విద్యారంగంలో సమూల మార్పుల కోసం ప్రభుత్వం విద్యా కమిషన్‌ను ఏర్పాటు చేయాలన్నారు. 'ఉపాధ్యాయ ఉద్యమం మహిళల పాత్ర-సవాళ్లు' అనే అంశంపై అధ్యాపక జ్వాల పత్రిక సంపాదకురాలు జి.కళావతి మాట్లాడుతూ.. ఉపాధ్యాయ ఉద్యమంలో మహిళల పాత్ర పెరగాల్సిన అవసరం ఉందని అభిప్రాయపడ్డారు. అప్పుడు సమస్యల పరిష్కారం ఉంటుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో డీటీఎఫ్ హనుమకొండ, వరంగల్ జిల్లాల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు కె.శ్రీనివాసులు, టి.సుదర్శనం, ఎ.గోవిందరావు, కె.యాకయ్య, సముద్రాల అనిత, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి టి.లింగారెడ్డి, ఎం.గంగాధర్, ఎ.శ్రీనివాస్‌రెడ్డి, ఎం.రాజ్ కుమార్, సమ్మిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

గాలిపటాలు ఎగురువేసేటప్పుడు జాగ్రత్తలు పాటించాలి

నయింనగర్, జనవరి 12: సంక్రాంతి పండుగను పురస్కరించుకుని ఎన్‌పీడీసీఎల్ పరిధిలోని 18 జిల్లాల పరిధిలోని విద్యుత్ వినియోగదారులకు, చిన్నారులకు గాలిపటాలు ఎగురవేసేటప్పుడు జాగ్రత్తలు పాటించాలని ఎన్‌పీడీసీఎల్ సీఎండీ కర్నాటి వరుణ్‌రెడ్డి సూచించారు. హనుమకొండ నక్కలగుట్టలోని విద్యుత్ భవన్‌లో సీఎండీ వరుణ్‌రెడ్డి శుక్రవారం సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా సీఎండీ మాట్లాడుతూ.. విద్యుత్ తీగలు, సెల్‌ఫోన్ టవర్లు ఉన్న చోట గాలిపటాలు ఎగురవేయకూడదని, రోడ్ల వెంట గాలిపటాల కోసం పరుగులు పెట్టవద్దని, ఇంటి దాబాలపై విద్యుత్ లైన్లు ఉన్న దగ్గర గాలిపటాలు ఎగురవేయకూడదని సూచించారు. తల్లిదండ్రులు తమ పిల్లలు దాబాలపై వెళ్లకుండా చూడాలని, వినియోగదారులు ఎప్పటికప్పుడు విద్యుత్ పట్ల అప్రమత్తంగా ఉండాలని, సంక్రాంతి పండుగను వినియోగదారులందరూ సంతోషంగా జరుపుకోవాలని సీఎండీ వరుణ్‌రెడ్డి కోరారు.

అలిశెట్టి ప్రభాకర్‌కు ఘన నివాళి

- కాళోజీ విగ్రహం వద్ద జయంతి, వర్ధంతి

హనుమకొండ, జనవరి 12 (ఆంధ్రజ్యోతి): కష్టజీవులకు ఇరువైపు నిలబడ్డ కవి అలిశెట్టి ప్రభాకర్ అని తెలంగాణ రచయితల వేదిక (తెరవే) హనుమకొండ శాఖ అధ్యక్షుడు సాదు మహేందర్ అన్నారు. శుక్రవారం హనుమకొండ నక్కలగుట్టలోని ప్రజాకవి కాళోజీ విగ్రహం వద్ద అలిశెట్టి ప్రభాకర్ జయంతి, వర్ధంతి కార్యక్రమాన్ని నిర్వహించారు. ఆయన చిత్రపటం వద్ద నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో కవులు టి.ఆనందాచారి, వి.రాంబ్రహ్మచారి తదితరులు పాల్గొన్నారు. ప్రభాకర్ కవితలను చదివి వినిపించారు.



కాళోజీ విగ్రహం వద్ద అలిశెట్టి ప్రభాకర్ చిత్రం ముందు నివాళులర్పిస్తున్న తెరవే ప్రతినిధులు

మార్కెట్‌కు సంక్రాంతి సెలవులు

వరంగల్‌టౌన్, జనవరి 12: ఏనుమాముల వ్యవసాయ మార్కెట్‌కు సంక్రాంతి పండుగను పురస్కరించుకుని నాలుగురోజులు సెలవులు ప్రకటించినట్లు మార్కెట్ కమిటీ కార్యదర్శి సంగయ్య శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. శనివారం వారతపు సెలవు, ఆదివారం భోగి, సాధారణ సెలవు, సోమవారం సంక్రాంతి, మంగళవారం కనుమ పండుగలను పురస్కరించుకుని సెలవులు ప్రకటించినట్టు పేర్కొన్నారు. బుధవారం నుంచి మార్కెట్లో క్రయ విక్రయాలు యథావిధిగా సాగుతాయని వెల్లడించారు. రైతులు, వ్యాపారులు, కార్మికులు మార్కెట్ కమిటీకి సహకరించాలని కోరారు.

పారిశుధ్య కార్మికులను పర్మినెంట్ చేయాలి..

ఎమ్మార్పీఎస్- టీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు వంగపల్లి శ్రీనివాస్

కాళోజీ జంక్షన్, జనవరి 12: ఉద్యోగ భద్రత లేని పారిశుధ్య కార్మికులను పర్మినెంట్ చేయాలనే ఉద్దేశంతో ఫిబ్రవరి 29న హైదరాబాద్‌లోని ఇందిరా పార్కు వేదికగా నిర్వహించ తలపెట్టిన పోరుగర్జన కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఎమ్మార్పీఎస్ - టీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు వంగపల్లి శ్రీనివాస్ విజ్ఞప్తి చేశారు. శుక్రవారం హనుమకొండ హరిత కాకతీయ హోటల్‌లో నిర్వహించిన ఉమ్మడి వరంగల్ జిల్లా ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. సమావేశానికి హనుమకొండ జిల్లా ఎమ్మార్పీఎస్ - టీఎస్ అధ్యక్షుడు రాజేష్‌ఖన్నా అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా వంగపెల్లి శ్రీనివాస్ మాట్లాడుతూ.. గత ప్రభుత్వాలు కులాలకు ప్రాతినిధ్యం ఇచ్చి ఒక్కో కులానికి ఆర్థికంగా సహాయం చేశాయని అన్నారు. ఒక్కో కులానికి వేర్వేరు కుల వృత్తులు ఉన్నాయని వాటితోపాటు మాదిగలకు కూడా కుల వృత్తి ఉందని అన్నారు. కానీ సమాజంలో ఎంతో ఆధునికత సంతరించి వృత్తికి ఆదరణ లేక పారిశుధ్య కార్మికులుగా పనిచేస్తున్నారని అన్నారు. ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టిన రేవంత్‌రెడ్డి మాదిగలను అక్కున చేర్చుకొని ఆదుకోవాలని ఆయన కోరారు. డప్పు, చెప్పు వృత్తిదారులకు నెలకు రూ. 5 వేల చొప్పున పెన్షన్ ఇవ్వాలని మంత్రివర్గంలో స్థానం కల్పించాలని ట్యాంక్ బండ్‌పై సదాలక్ష్మీ విగ్రహాన్ని ఏర్పాటు చేయాలని ఆయన ప్రభుత్వాన్ని కోరారు.



సమావేశంలో మాట్లాడుతున్న వంగపల్లి శ్రీనివాస్

ఈ సమావేశంలో ఎమ్మార్పీఎస్ -టీఎస్ నాయకులు ఇద్దునూరి యాకయ్య, రామంచ సారన్న, చిన్న స్వామి మాదిగ, రాష్ట్ర కార్యదర్శులు ఆరెపల్లి బాబన్న, దేవరకొండ సదానందం, భూపాలపల్లి జిల్లా అధ్యక్షుడు ఎలుకటి రాజయ్య, ములుగు జిల్లా అధ్యక్షుడు గడ్డం భద్రయ్య రాకేష్, సుధన్, అనిల్, తిరుపతి తదితరులు పాల్గొన్నారు.

యువకుడి అవయవాల దానం

గీసుగొండ, జనవరి 12: వరంగల్ జిల్లా గీసుగొండ మండల కేంద్రానికి చెందిన చెందిన కర్ణకంటి శ్రీకాంతాచారి(27) అనారోగ్యంతో శుక్రవారం మృతిచెందగా, అతని అవయవాలను తల్లిదండ్రులు హైదరాబాద్‌లోని కేర్ ఆస్పత్రికి దానం చేశారు. కుటుంబీకుల కథనం ప్రకారం.. శ్రీకాంతాచారి కొన్నేళ్లుగా హైదరాబాద్‌లోని కేర్ హాస్పిటల్‌లో ఇన్సూరెన్స్ విభాగంలో పనిచేశాడు. ఏడాది కిందట అనారోగ్యానికి గురికాగా, వైద్యపరీక్షలు నిర్వహించగా బ్లడ్ క్లాటింగ్ అవుతున్నట్లు డాక్టర్లు గుర్తించి చికిత్స చేస్తున్నారు. తరుచూ తలనొప్పికి గురవుతుండటంతో కొద్దిరోజుల కిందట శ్రీకాంతాచారి ఇంటికి ఇక్కడే ఉంటున్నాడు. రెండు రోజుల కిందట తలనొప్పితోపాటు మెడభాగంలో నొప్పిరావడంతో అతడిని కేర్ ఆస్పత్రికి తరలించగా, చికిత్స పొందుతూ శుక్రవారం ఉదయం మృతిచెందాడు. బతికున్నప్పుడు శ్రీకాంతాచారి చెప్పిన సూచన మేరకు తల్లిదండ్రులు అతడి అదే ఆస్పత్రి(కేర్)కి అవయవాలను దానం చేశారు. శ్రీకాంతాచారి అంత్యక్రియలు సాయంత్రం గీసుగొండలో నిర్వహించారు. శ్రీకాంతాచారి తల్లిదండ్రులు బ్రహ్మచారి, సరస్వతి వడ్రంగి పనిచేస్తూ జీవిస్తుండగా, ముగ్గురు అన్నలు ఉన్నారు. ఈఘటనతో గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి.



శ్రీకాంతాచారి (ఫైల్)

దివ్యాంగులకు ప్రత్యేక ఓపీ

హనుమకొండ అర్బన్, జనవరి 12: వరంగల్ జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు ఎంజీఎం ఓపీ బ్లాక్‌లో దివ్యాంగుల కోసం ప్రత్యేక ఓపీ ఏర్పాటు చేసినట్లు ఎంజీఎం సూపరింటెండెంట్ డాక్టర్ వి.చంద్రశేఖర్ తెలిపారు. శుక్రవారం ఓపీని ఆర్ఎంవోలతో కలిసి ఆయన సందర్శించారు. దివ్యాంగులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. సాధారణ ఓపీ సమయాలే ఈ ఓపీకి వర్తిస్తాయని పేర్కొన్నారు.



మాట్లాడుతున్న సూపరింటెండెంట్ డాక్టర్ చంద్రశేఖర్

రేపు కైట్ ఫెస్టివల్

ఆర్ట్స్ అండ్ సైన్స్ కాలేజీ మైదానంలో నిర్వహణ

హనుమకొండ, జనవరి 12 (ఆంధ్రజ్యోతి): కైట్ ఫెస్టివల్ (పతంగుల పండుగ)ను ఈనెల 14న సంక్రాంతి పర్వదినం రోజు నిర్వహించాలని నిర్ణయించారు. వాస్తవానికి సంక్రాంతికి ఒక రోజు ముందు శనివారం నిర్వహించాలని ముందుగా అనుకున్నప్పటికీ వీలుకాకపోవడంతో ఆదివారంరోజున ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు నిర్వహించాలని నిర్ణయించారు. ఆర్ట్స్ అండ్ సైన్స్ కాలేజీ మైదానంలో జరిగే పతంగుల పండుకను కలెక్టర్ సిక్తా పట్నాయక్ ప్రారంభిస్తారు. ప్రజాప్రతినిధులు, అధికారులు హాజరుకానున్న ఈ ఉత్సవంలో పతంగుల ఎగురవేతలో ఆసక్తికలిగిన ప్రతి ఒక్కరు పాల్గొనవచ్చునని నిర్వాహకులు తెలిపారు.

చిందు కళాకారులకు ప్రోగ్రాంలను కేటాయించాలి

వడ్డెపల్లి, జనవరి 12: కళారంగాన్ని జీవనోపాధిగా మలుచుకొన్న చిందు యక్షగాన కళాకారులకు ప్రభుత్వ పథకాలను కేటాయించాలని చిందు యక్షగాన కళాకారుల సంఘం రాష్ట్ర గౌరవ అధ్యక్షుడు గజవెల్లి సారయ్య సమాచార పౌర సంబంధాల శాఖ ప్రత్యేక కమిషనర్ అశోక్‌రెడ్డిని హైదరాబాద్‌లోని కార్యాలయంలో శుక్రవారం మర్యాద పూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేసి వినతి పత్రాన్ని సమర్పించారు. ఈ సందర్భంగా గజవెల్లి సారయ్య మాట్లాడుతూ.. మేడారం జాతరలో చిందు యక్షగాన కళాకారులకు ప్రోగ్రాంలు అప్పజెప్పడంతో పాటు పండుగలు, ఇతర జాతరలలో సైతం కళా ప్రదర్శనలు ఇచ్చి ప్రజలను చైతన్యపర్చేందు కోసం ప్రభుత్వం అవకాశం కల్పించాలని కోరారు. 50 సంవత్సరాలు పైబడిన వృద్ధ కళాకారులకు నెలకు రూ. 6వేల చొప్పున పెన్షన్ మంజూరు చేయాలని, యువ కళాకారులకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించాలని, ఇందిరమ్మ ఇళ్లు, రేషన్ కార్డులు, నివేశన స్థలాలు మంజూరి చేయాలని విజ్ఞప్తి చేశారు. అనంతరం సమాచార పౌర సంబంధాల శాఖ సంయుక్త సంచాలకుడు డీఎస్. జగన్‌ను సైతం మర్యాద పూర్వకంగా కలిసి వినతి పత్రాన్ని సమర్పించారు.



సమాచార పౌరసంబంధాల శాఖ ప్రత్యేక కమిషనర్ అశోక్‌రెడ్డికి వినతి పత్రం ఇస్తున్న గజవెల్లి సారయ్య

ఇంజనీరింగ్ అధికారులతో కడియం భేటీ

నియోజకవర్గ అభివృద్ధి పనులపై సమీక్ష

హనుమకొండ టౌన్, జనవరి 12: స్టేషన్ ఘనపూర్ నియోజకవర్గానికి సంబంధించి పంచాయతీరాజ్ విభాగానికి చెందిన అభివృద్ధి పనులపై స్థానిక ఎమ్మెల్యే కడియం శ్రీహరి ఇంజనీరింగ్ అధికారులతో భేటీ అయ్యారు. శుక్రవారం హనుమకొండ జడ్పీ కార్యాలయంలో పీఆర్ ఎస్ఈ రఘువీరారెడ్డి, ఈఈ శంకరయ్యతో పాటు పలు ఇంజనీరింగ్ అధికారులతో భేటీ అయిన కడియం శ్రీహరి అభివృద్ధి పనులను సమీక్షించారు. నియోజకవర్గంలో పంచాయతీరాజ్ శాఖ ఆధ్వర్యంలో పీఎంజీఎస్‌వై, సీడీపీ తదితర నిధులతో చేపడుతున్న అభివృద్ధి పనులను వేగవంతం చేయాలని కడియం సూచించారు. మంజూరైన పనులకు వెంటనే టెండర్లు పిలిచి పనులు ప్రారంభించాలన్నారు.

ఈనెలాఖరుతో స ర్పంచ్‌ల పదవీకాలం పూర్తవుచున్నందున చేసిన పనులను వెంటనే రి కార్డు చేయాలన్నారు. నాణ్యతతో పనులు జరిగేలా ఇంజనీరింగ్ అధికారులు క్షేత్రస్థాయిలో పర్యటించాలని కడియం శ్రీహరి అధికారులకు సూచించారు. కాగా, ఎమ్మెల్యేగా విజయం సాధించి తొలిసారి జడ్పీకి వ చ్చిన కడియంకు ఇంజనీరింగ్ అధికారులు స్వాగతం పలికి సత్కరించారు.



అధికారులతో మాట్లాడుతున్న కడియం

డీసీసీ సేవలను సద్వినియోగం చేసుకోవాలి

- ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు



డీసీసీ బ్రాంచిని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు

గణపురం, జనవరి 12: సహకార బ్యాంకుల సేవలు సద్వినియోగం చేసుకోవాలని ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు అన్నారు. శుక్రవారం గణపురం మండల కేంద్రంలో డీసీసీ బ్యాంకు శాఖ ప్రారంభోత్సవానికి డీసీసీ చైర్మన్ మార్నేని రవీందర్‌రావుతో కలిసి హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ డీసీసీ బ్యాంకు అందించే హోమ్ లోన్, పర్సనల్ లోన్, గోల్డ్ లోన్, ఎడ్యుకేషన్ లోన్, వెహికిల్స్ లోన్ తదితర రుణాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. కమర్షియల్ బ్యాంకులతో సమానంగా సేవలందిస్తాయని పేర్కొన్నారు. కార్యక్రమంలో జడ్పీటీసీ గండ్ర పద్మ, పీఏసీఎస్ చైర్మన్ పూర్ణచందర్‌రెడ్డి, చెల్పూరు పీఏసీఎస్ చైర్మన్ గండ్ర సత్యనారాయణరెడ్డి, వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ లక్ష్మీనరసింహారావు, వైస్ ఎంపీపీ అశోక్, సర్పంచుల ఫోరం మండల అధ్యక్షుడు పొట్ల నగేష్ తదితరులు పాల్గొన్నారు.

ఇటుకబట్టీ నిర్వాహకుడిపై కేసు నమోదు

నెల్లికుదురు (మహబూబాబాద్ జిల్లా), జనవరి 12 : ఇటుక బట్టీలో బాలకార్మికుడితో పని చేయిస్తున్న నిర్వాహకుడిపై శుక్రవారం కేసు నమోదు చేసినట్లు ఎస్సై క్రాంతికిరణ్ తెలిపారు. ఎస్సై కథనం ప్రకారం.. మహబూబాబాద్ జిల్లా నెల్లికుదురు మండలంలోని శ్రీరామగిరి స్టేజీ సమీపంలో ఖమ్మం జిల్లా అశ్వారావుపేట మండలం నందిపాడుకు చెందిన గుంజె వెంకటేశ్వర్లు తన ఇటుక బట్టీలో 14 ఏళ్ల బాలుడితో పనులు చేయిస్తున్నాడు. ఈ క్రమంలో లేబర్ ఆఫీసర్ గట్టిపెల్లి వినోద్‌కుమార్ పట్టుకొని, పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా వెంకటేశ్వర్లుపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై క్రాంతికిరణ్ వివరించారు.

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

నయింనగర్, జనవరి 12: ఎన్‌పీడీసీఎల్ హనుమకొండ డివిజన్ 11కేవీ మెయింటెనెన్స్‌లో భాగంగా న్యూశాయంపేట సబ్‌స్టేషన్ పరిధిలోని న్యూశాయంపేట ప్రాంతంలో శనివారం ఉదయం 8.30గంటల నుంచి 11.30గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపి వేయనున్నారు. అదేవిధంగా బాలసముద్రంలో ఉదయం 8గంటల నుంచి 10 గంటల వరకు, నక్కలగుట్టలో ఉదయం 8గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు, ఆర్ఈసీ, సోమిడి ప్రాంతాల్లో ఉదయం 9గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు, రాంపూర్, మడికొండ ప్రాంతాల్లో ఉదయం 9గంటల నుంచి మధ్యాహ్నం 12.30 గంటల వరకు విద్యుత్‌ను నిలిపివేయనున్నారు. ఈ మేరకు హనుమకొండ డివిజన్ ఇంజనీర్ ఎలక్ట్రికల్, ఆపరేషన్స్ జి.సాంబరెడ్డి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు.

కొత్తకొండలో భక్తులకు విస్తృత ఏర్పాట్లు

భీమదేవరపల్లి, జనవరి 12: కొత్తకొండ వీరభద్రస్వామి జాతరలో భక్తులకు విస్తృత ఏర్పాట్లు కల్పించాలని అధికారులను అడిషనల్ కలెక్టర్ రాధికగుప్తా ఆదేశించారు. శుక్రవారం దేవాలయంలో శ్రీవీరభద్రస్వామికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం భక్తులకు కల్పించాల్సిన ఏర్పాట్లపై ఆర్డీవో రమేష్, ఎంపీడీవో భాస్కర్, ఆలయ ఈవో కిషన్‌రావులతో ప్రత్యేకంగా సమావేశమయ్యారు. జాతరకు వచ్చే భక్తుల సంఖ్యను బట్టీ ఏర్పాట్లు చేయాలన్నారు. క్యూలైన్లు, పారిశుధ్య నిర్వాహణ, వైద్యం, విద్యుత్, రవాణా, మంచినీరు తదితర అంశాలపై అధికారులతో చర్చించారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా ఏర్పాట్లు చేయాలని ఆదేశాలు జారీ చేశారు. జాతర జరిగే రోజు నుంచి చివరి వరకు తాను అందుబాటులో ఉంటానని, ఏమైనా సమస్యలు ఉంటే తన దృష్టికి తీసుకురావాలన్నారు. ముఖ్యంగా క్యూలైన్ల నిర్వహణ సక్రమంగా ఉండాలన్నారు. రాత్రి వేళల్లో జాతర జరుగుతుందని, 24 గంటల విద్యుత్ సరఫరా అయ్యే విధంగా అధికారులు జాగ్రత్తగా ఉండాలన్నారు. పోలీసులు జాతరలో భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా నిరంతరం పర్యవేక్షించాలన్నారు. జాతరకు వచ్చే రూట్ మ్యాప్‌ను పరిశీలించారు. ఏవైపు నుంచి రద్దీ ఎక్కువగా ఉంటుందో అక్కడ అధికారుల పర్యవేక్షణ ఎక్కువగా ఉండాలని సూచించారు. పారిశుధ్య నిర్వహణపై డీపీవో జగదీష్‌తో అడిషనల్ కలెక్టర్ చర్చించారు. ఈ కార్యక్రమంలో సీఐ ప్రవీణ్ కుమార్, ఎస్ఐలు సాయిబాబు, వెంకటేశ్వర్లు, డిప్యూటీ తహసీల్దార్ వేణుగోపాల్, ఎంపీవో నాగరాజు, మాజీ చైర్మన్లు పిడిశెట్టి కనకయ్య, చిట్టంపల్లి అయిలయ్య, మాడిశెట్టి కుమారస్వామి, అర్చకులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



మిర్చి ధరలపై జేడీ సమీక్ష



వరంగల్‌టౌన్, జనవరి 12: ఏనుమాముల వ్యవసాయ మార్కెట్లో శుక్రవారం మార్కెటింగ్ శాఖ జాయింట్ డైరెక్టర్ (జేడీ), మార్కెట్ పర్సన్ ఇన్‌చార్జ్ మల్లేశం మిర్చి ధరలపై మార్కెట్ అధికారులు, హార్టికల్చర్ అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఇటీవల మిర్చి ధరల విషయంలో రైతులకు తలెత్తిన అంశాలపై చర్చించారు. ఇక ముందు తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. కార్యక్రమంలో డీఎంవో ప్రసాదరావు, మార్కెట్ కమిటీ కార్యదర్శి సంగయ్య, గ్రేడ్ 2 కార్యదర్శులు బియాబానీ, రాము, అకౌంటెంట్ రాజ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

'సింగిల్ యూజ్ ప్లాస్టిక్‌ను నియంత్రించాలి'

వరంగల్ కలెక్టరేట్, జనవరి 12: సింగిల్ యూజ్ ప్లాస్టిక్‌ను నియంత్రించాలని, భవిష్యత్తు తరాలకు నివాసయోగ్యమైన పరిసరాలను అందించడం మనందరి బాధ్యతని అటవీ, పర్యావరణ, దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ ఒక ప్రకటనలో తెలిపారు. శుక్రవారం హైదరాబాద్‌లో ప్రకటన ద్వారా తెలియజేస్తూ పచ్చదనం పెంపునకు ఎంతగా ప్రాధాన్యం ఇస్తున్నామో, ప్లాస్టిక్ వాడకాన్ని కూడా వీలైనంత త్వరగా తగ్గించాలని కోరారు. సింగిల్ యూజ్ ప్లాస్టిక్ వాడకంతో అనేక అనర్థాలు ఉన్నాయని అవగాహన లేకుండా విపరీతంగా వాడుతున్న ప్లాస్టిక్ వ్యర్థాలతో పరిసరాలు గాలి, నీరు కలుషితమవుతున్నాయని అన్నారు. ప్లాస్టిక్ బాటిల్స్ బదులుగా గ్లాస్ బాటిల్స్, స్టీల్ వస్తువుల వాడకాన్ని పెంచాలని సూచించారు.

మద్ది మేడారంలో సౌకర్యాలను కల్పించాలి

నర్సంపేట ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డి



రైతులు, అధికారులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే, కలెక్టర్

నల్లబెల్లి, జనవరి 12: మండలంలోని మద్ది మేడారానికి వచ్చే ప్రజలకు సమగ్ర సౌకర్యాలను కల్పించాలని కాంగ్రెస్ పార్టీ నర్సంపేట ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డి అన్నారు. శుక్రవారం కలెక్టర్ ప్రావీణ్యతో కలిసి ఎమ్మెల్యే మద్ది మేడారానికి చేరుకొని, సమ్మక్క, సారలమ్మలను దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం జరిగిన సమీక్ష సమావేశంలో ఎమ్మెల్యే కలెక్టర్‌లు మాట్లాడుతూ.. మద్దిమేడారానికి ప్రధానంగా రోడ్డు సమస్య, పార్కింగ్ సమస్య ఉందని, ఇందుకోసం విశాలమైన రోడ్డును ప్రత్యేక గ్రాంట్ నిధుల ద్వారా ఏర్పాటు చేస్తామన్నారు. జాతరకు వచ్చే భక్తులకు ఎలాంటి సమస్యలు తలెత్తకుండా ఆరోగ్యశాఖ, పోలీస్ శాఖ, పంచాయతీశాఖ, విద్యుత్‌శాఖ తదితర శాఖల అధికారులకు వారు సూచనలు చేశారు. కార్యక్రమంలో ఈస్ట్ జోన్ డీసీపీ రవీందర్, ఆర్డీవో కృష్ణవేణి, ఏసీపీ తిరుమల్, తహసీల్దార్ రాజేష్, ఎస్సై నాగేష్, ఎంపీడీవో విజయ్‌కుమార్, సర్పంచ్ గోనె శ్రీదేవి, నాయకులు చిట్యాల తిరుపతిరెడ్డి, సీతారాంరెడ్డి, మాలోతు రమేష్, వైనాల అశోక్, చరణ్‌సింగ్ పాల్గొన్నారు.

ఘనంగా వివేకానంద జయంతి



పాపయ్యపేట చమన్ వద్ద మాట్లాడుతున్న కమిషనర్ రిజ్వాన్‌బాషా



మామునూరులో నివాళులు అర్పిస్తున్న నాయకులు



ధర్మారంలోని బీజేపీ కార్యాలయంలో..

మట్టెవాడ, జనవరి 12: యువతకు స్ఫూర్తిదాత స్వామి వివేకానంద అని గ్రేటర్ వరంగల్ మునిసిపల్ కార్పొరేషన్ కమిషనర్ షేక్ రిజ్వాన్ బాషా అన్నారు. శుక్రవారం వివేకానంద జయంతి సందర్భంగా పాపయ్యపేట చమన్ వద్ద వివేకానంద విగ్రహానికి నివాళులర్పించారు. అనంతరం అన్నదాన కార్యక్రమాన్ని కమిషనర్ ప్రారంభించారు. కమిషనర్ మాట్లాడుతూ తల్లిదండ్రులు వారి పిల్లలకు వివేకానందుడి సూక్తులను, వారి ఆశయాలను, బోధనలను నేర్పించాలన్నారు. మాజీ చీఫ్ విప్ దాస్యం వినయ్ భాస్కర్, మాజీ మేయర్ గుండా ప్రకాశ్‌రావు మాట్లాడుతూ భారతీయ సనాతన ధర్మాన్ని ప్రపంచానికి చాటిన వ్యక్తి వివేకానందుడని అన్నారు.

» వరంగల్ కలెక్టరేట్: జిల్లా కలెక్టర్ అనుమతి మేరకు జిల్లా యువజనోత్సవాలు ఘనంగా జరిగాయి. ఓసిటీలోని స్టేడియంలో స్వామి వివేకానంద జయంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి జిల్లా యువజన క్రీడల అధికారి టీపీఎల్ సత్యవాణి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా విద్యార్థుల క్రీడా పోటీల్లో వివిధ విభాగాల్లో నిర్వహించిన పోటీల నిర్వహణలో విజేతలుగా నిలిచిన వారిని అభినందించి సత్కరించారు. కార్యక్రమంలో ఓలంపిక్ అసోసియేషన్ సెక్రటరి జి. నరేష్, జాతీయ యూత్ అవార్డు గ్రహీత పి. సంతోష్ కుమార్, ఎం. విశ్వయ్య, శ్రీలత, పావని పాల్గొన్నారు.ఏవీవీ కళాశాల ఎన్ఎస్ఎస్ కో ఆర్డినేటర్ కొడి మ్యాల శ్రీనివాస్‌రావు ఆధ్వర్యంలో ఏవీవీ కళాశాల నుంచి పాపయ్య పేట చమన్ వివేకానంద విగ్రహం వరకు ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ భుజంధర్‌రెడ్డి అధ్యాపకు లు సంజీవ, వి.శ్రీధర్, బి. గోపి, జి.శ్రీనివాస్, చండీశ్వర్, సునిల్, అ శోక్ పాల్గొన్నారు. పాపయ్యపేట చమన్‌లో వివేకానంద సేవా సమితి ఆధ్వర్యంలో ఉత్సవాలు నిర్వహించారు. వరంగల్ అర్బన్ కో ఆపరేటీవ్ బ్యాంకు చైర్మన్ ఎర్రబెల్లి ప్రదీప్‌రావు, బీఆర్ ఎస్ నాయకులు ఏనుగుల రాకేష్‌రెడ్డిలు వివేకానందుడి విగ్రహానికి నివాళులర్పించారు. మాజీ 'కుడా' చైర్మన్ సుందర్‌రాజ్ యాదవ్, కార్పొరేటర్ తేజస్వీ శిరీష్, 11వ డివిజన్ కార్పొరేటర్ దేవరకొండ విజయలక్ష్మి సురేందర్, కొడకండ్ల సదాంత్, వేద ప్రకాష్, సత్యనారాయణ, వినోద్, దయానంద్, జట్లింగ్ ఎల్లోసా, రమేష్, శ్రీనివాస్‌రెడ్డి, ఎండి షఫీ, వాడిక నాగరాజు, పరశురాములు తదితరులు పాల్గొన్నారు.

» గీసుగొండ : స్వామి వివేకానందుని బోధనలు ప్రపంచానికే ఆదర్శమని బీజేపీ జిల్లా అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే కొండేటి శ్రీధర్ అన్నారు. వివేకానందుని జన్మదినం జాతీయ సమైక్యత యువ దివస్‌ను ధర్మారంలోని పార్టీ జిల్లా కార్యాలయంలో నిర్వహించారు. వివేకానందుని చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం మాట్లాడుతూ హిందూమతం ఔన్నత్యాన్ని పాశ్చాత్య దేశానికి చాటిచెప్పిన ఘనుడని కొనయాడారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే వన్నాల శ్రీరాములు, నాయకులు అశోక్, గాడిపల్లి రాజు, తిరుపతిరెడ్డి, త్రిలోకేశ్వర్, కార్యాలయ కార్యదర్శి కంది క్రాంతికుమార్ 16వ డివిజన్ అధ్యక్షుడు గోదాసి అశ్వినికుమార్ పాల్గొన్నారు. ధర్మారం ఎస్ఎస్ డిగ్రీ కళాశాలలో కేయూ దూరవిద్య కేంద్రం కో ఆర్డినేటర్ కొక్కొండ, శ్రీకాంత్, అధ్యాపకులు ప్రణయ్, రాజమౌళి పాల్గొ ని నివాళులర్పించారు.

» మామునూరు: మామునూరులో జాతీయ రహదారి పక్కనే ఉన్న వివేకానంద విగ్రహానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో దేవేందర్‌రెడ్డి, సాంబయ్య యాదవ్, లక్ష్మా రెడ్డి, తిరుపతిరెడ్డి, యాదగిరి. కోటి, కుమారస్వామి, ముత్తారెడ్డి, లింగ మూర్తి, కిశోర్, శ్రీనివాస్, నజీర్, వెంకట్‌రెడ్డి, రాజు పాల్గొన్నారు. తిమ్మాపురంలో ఏకశిల యూత్ అసోసియేషన్, అండ్ లైబ్రరీ ముఖ్య సలహాదారు మేకల సూరయ్య ఆధ్వర్యంలో వివేకానంద చిత్ర పటానికి నివాళులర్పించారు.

» సంగెం: కుంటపల్లి గ్రామపంచాయతీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఎంపీపీ కళావతి ముఖ్యఅతిథిగా హాజరై వివేకానందుడికి నివాళులర్పించారు. అలాగే గ్రామానికి చెందిన ఆర్కే ఫౌండేషన్ ఆధ్వర్యంలో రక్తదాన శిబిరాన్ని సర్పంచ్ కావాటి వెంకటయ్యతో కలిసి ఎంపీపీ ప్రారంభించారు. కార్యక్రమంలో యార బాలకృష్ణ, చిర్ర రాజ్‌కుమార్, పెండ్లి పురుషో త్తం రెడ్డి, బొమ్మాల శంకర్, పోడేటి ప్రశాంత్, చిర్ర సాంబరాజు, ప్రేమ్‌కుమార్ పాల్గొన్నారు.

» శంభునిపేట: రంగశాయిపేట యూత్ ఫోర్స్ (ఆర్‌వైఎఫ్) సభ్యులు రంగశాయిపేట నెహ్రూ విగ్రహం వద్ద ఆర్‌వైఎఫ్ ఆధ్వర్యంలో వివేకానందుని జయంతి సందర్భంగా యువజన దినోత్సవాన్ని నిర్వహించారు. వివేకానందుని చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం పండ్లు పంపిణీ చేశారు. ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ప్రిన్సిపాల్ శోభాదేవి, వివేకానందుని చిత్రపటానికి నివాళులర్పించారు. కరీమాబాద్ లక్ష్మీనగర్‌లో జ్యోతిబాపూలే జాతీయ అవార్డు గ్రహీత గోగికార్ రవీందర్ ఆధ్వర్యంలో వివేకానందుని చిత్రపటానికి నివాళులర్పించారు.

వార్డు ఆఫీసర్ల బాధ్యతలు కీలకం



సమావేశంలో మాట్లాడుతున్న కమిషనర్

జీడబ్ల్యూఎంసీ కమిషనర్ షేక్ రిజ్వాన్ బాషా

జీడబ్ల్యూఎంసీ(హనుమకొండ సిటీ), జనవరి 12: జీడబ్ల్యూఎంసీ సేవలు, పరిపాలనపరమైన అంశాల్లో వార్డు ఆఫీసర్ల బాధ్యతలు కీలకమైనవని కమిషనర్ షేక్ రిజ్వాన్ బాషా స్పష్టం చేశారు. శుక్రవారం హనుమకొండలోని బల్దియా ప్రధాన కార్యాలయంలో వీఆర్ఏలకు శిక్షణ కార్యక్రమం జరిగింది. రెవెన్యూశాఖ నుంచి వీఆర్ఏలు బల్దియాలోకి రావడంతో వారి బాధ్యతల నిర్వహణపై కమిషనర్ శిక్షణ ఇచ్చారు. డివిజన్లలో పారిశుధ్య సేవలు, ఆస్తి పన్నుల వసూళ్లు, నీటి సరఫరా, లీకేజీలు తదితర వాటితో పాటు ప్రభుత్వ పరమైన సంక్షేమ కార్యక్రమాలు అమలు, లబ్ధిదారుల ఎంపిక, తదితర విధులను నిర్వహించడంలో వీఆర్ఏలు అంకితభావంతో పని చేయాలని సూచించారు. డివిజన్ కార్పొరేటర్లతో సమన్వయం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో అదనపు కమిషనర్ అనిసూర్ రషీద్, డిప్యూటీ కమిషనర్లు క్రిష్ణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

» ప్రజాపాలనలో స్వీకరించిన అభయహస్తం దరఖాస్తుల వివరాలను క్షేత్రస్థాయిలో పరిశీలించనున్నట్లు కమిషనర్ షేక్ రిజ్వాన్ బాషా వెల్లడించారు. మొత్తం 2,10,204 దరఖాస్తుల నమోదు జరిగినట్లు తెలిపారు.

పండుగలు సనాతన ధర్మాన్ని పరిరక్షిస్తాయి..

పండుగలు సనాతన ధర్మాన్ని పరిరక్షిస్తాయని, సంస్కృతి, సంప్రదాయలను భవిష్యత్‌తరానికి పరిచయం చేస్తాయని కమిషనర్ షేక్ రిజ్వాన్ బాషా వెల్లడించారు. మెప్మా ఆధ్వర్యంలో జీడబ్ల్యూఎంసీ ప్రధాన కార్యాలయ ఆవరణలో శుక్రవారం ముగ్గుల పోటీలు జరిగాయి. కమిషనర్ మాట్లాడుతూ సంక్రాంతి పండుగ వస్తుందంటే అందరి గుర్తొచ్చేది రంగవల్లులని పేర్కొన్నారు. సంక్రాంతి పండుగను పురస్కరించుకొని 13న కలెక్టర్ ఆధ్వర్యంలో హనుమకొండలోని ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాల మైదానంలో కైట్ ఫెస్టివల్, సాంస్కృతిక కార్యక్రమాలు ఉంటాయన్నారు.

వ్యవసాయ ఉత్పత్తులపై ప్రదర్శన

మామునూరు, జనవరి 12 : మామునూరులో శుక్రవారం కృషి విజ్ఞాన కేంద్రం ప్రోగ్రాం కోఆర్డినేటర్ డాక్టర్ రాజన్న ఆధ్వర్యంలో మల్లారెడ్డి వ్యవసాయ విశ్వ విద్యాలయం విద్యార్థులు వ్యవసాయ ఉత్పత్తులపై ప్రదర్శన నిర్వహించారు. గ్రామీణ వ్యవసాయ పని అనుభవ కార్యక్రమంలో భాగంగా విద్యార్థులు డ్రమ్ సీడర్ విత్తన పరికరాన్ని వివిధ రకాల అధిక దిగుబడిని వరి విత్తనాలను, సమీకృత వ్యవసాయ విధానాన్ని రైతులకు ప్రదర్శించారు. కార్యక్రమంలో గ్రామ రైతు కన్వీనర్ రేగూరి లక్ష్మారెడ్డి, మాజీ పీఏసీఎస్ వైస్ చైర్మన్ మాదిరెడ్డి దేవేందర్‌రెడ్డి, కిసాన్ మోర్చా రాష్ట్ర ఉపాధ్యక్షుడు మల్లాడి తిరుపతిరెడ్డి, కిసాన్ మోర్చా రాష్ట్ర అధికార ప్రతినిధి బండి సాంబయ్య యాదవ్, నర్సింహారెడ్డి, రాజిరెడ్డి, పాల్గొన్నారు.

ఘనంగా ధనుర్మాసోత్సవాలు



కుంకుమ పూజలో పాల్గొన్న మహిళలు

మట్టెవాడ, జనవరి 12: రామన్నపేట బట్టల బజార్‌లోని శ్రీవేంకటేశ్వరస్వామి దేవాలయంలో ధనుర్మాసోత్సవాలు ఘనంగా సాగుతున్నాయి. శుక్రవారం ధనుర్మాసం 27వ రోజు పురస్కరించుకుని సుప్రభాతం, తిరుప్పావై పారాయణం, గోదాదేవి అమ్మవారికి అభిషేకం నిర్వహించారు. అనంతరం మహిళలు గోదాదేవికి కుంకు మార్చనలు చేశారు. 14న గోదా రంగనాయకుల కల్యాణం నిర్వహిస్తున్నట్లు ఆలయ ఈవో ఎలపాటి రత్నాకర్‌రెడ్డి, చైర్మన్ శ్రీనివాసాచార్యులు తెలిపారు. కార్యక్రమంలో అర్చకులు శ్రీధరాచార్యులు, సేవా సమితి సభ్యులు గందె గోవిందరాజులు, అశోక్, నందకిశోర్, లక్ష్మణ్, మాధురి, మాధవి, శ్రీలక్ష్మి, కల్పన పాల్గొన్నారు.

టీఎన్‌జీవోల కార్యవర్గం ఎన్నిక



కిరణ్‌ను సన్మానిస్తున్న టీఎన్‌జీవో సంఘం నాయకులు

గీసుగొండ,జనవరి 12: గీసుగొండ, సంగెం మండలాల టీఎన్‌జీవోల సంఘ కార్యవర్గాన్ని శుక్రవారం గీసుగొండలో ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా ఎ.కిరణ్, కార్యదర్శిగా సతీష్, కోశాధికారిగా శ్రీధర్, ఉపాధ్యక్షులుగా అర్జున్, కిరణ్, సత్యరాజ్, సతీష్, కళ్యాణి, శాలిని, జాయింట్ సెక్రటరీలుగా శుక్రుమియా, సందీప్, ప్రేమ్‌సాగర్, సాంబయ్య, స్వరూప, ఆర్గనైజింగ్ సెక్రటరీలుగా రవిందర్, రంజిత్, ఎల్లయ్య, ప్రచార కార్యదర్శిగా శంకర్, కార్యవర్గ సభ్యులుగా చందర్‌రావు, మధు, చిరంజీవి, నాగేశ్వర్‌రావులను ఎన్నుకున్నారు. కార్యక్రమంలో సంఘం జిల్లా అధ్యక్షుడు గజ్జెల రాంకిషన్, కార్యదర్శి గాజె వేణుగోపాల్, కోశాధికారి పాలకుర్తి సదానందం, సంయుక్త కార్యదర్శులు చందర్‌రావు, మధు, చిరంజీవి, నాగేశ్వర్‌రావు పాల్గొన్నారు.

'తాగునీటి సమస్యను తీర్చండి'

ఖిలావరంగల్, జనవరి 12: నగరంలోని 35వ డివిజన్‌లో తాగునీటి ఎద్దడిని తీర్చాలని కార్పొరేటర్ సోమిశెట్టి ప్రవీణ్ గ్రేటర్ వరంగల్ నగర పాలక సంస్థ సూపరింటిండెంట్ ఆఫ్ ఇంజనీర్ ప్రవీణ్ చందాని కోరారు. శుక్రవారం శివనగర్‌లోని నగర పాలక సంస్థ కార్యాలయంలో ఆయనకు కార్పొరేటర్ వినతి పత్రాన్ని అందజేశాడు. కార్పొరేటర్ మాట్లాడుతూ శివనగర్, పుప్పాలగుట్ట, వాటర్‌ట్యాంక్ నుంచి వాటర్ సప్లై సక్రమంగా రావడం లేదన్నారు. దీంతో శివనగర్, పుప్పాలగుట్ట, ఏసీరెడ్డినగర్, మైసయ్యనగర్ తదితర ప్రాంతాల్లో తాగునీరు రావడం లేదన్నారు. సమస్య పరిష్కారానికి కృషి చేస్తానని ఎస్ఈ ప్రవీణ్‌చందా హామీ ఇచ్చారు. కార్యక్రమంలో ఈఈ శ్రీనివాస్, డీఈ రవిందర్, ఏఈలు అబీబ్, ముజమిల్ పాల్గొన్నారు.

మేడారంలో వనదేవతలకు ముందస్తు మొక్కులు



మేడారంలో వనదేవతల గద్దెలకు పూజలు చేస్తున్న భక్తులు

మేడారం, జనవరి 12: ములుగు జిల్లా తాడ్వాయి మండలంలోని మేడారం వన దేవతలు సమ్మక్క, సారలమ్మలను దర్శించుకోవడానికి భక్తులు శుక్రవారం భారీగా తరలివచ్చారు. వచ్చే ఫిబ్రవరి 21 నుంచి నాలుగు రోజులపాటు ఆదివాసీ దేవతల మహా జాతర జరగనుంది. ఈ నేపథ్యంలో వివిధ ప్రాంతాలకు చెందిన 30 వేలకు పైగా భక్తులు మేడారం చేరుకొని తల్లుల గద్దెలకు ముందస్తు మొక్కులు చెల్లించుకున్నారు. ఈ క్రమంలో ముందుగా జంపన్నవాగులో పుణ్యస్నానాలు ఆచరించారు. కల్యాణ కట్టల్లో తలనీలాలు సమర్పించారు. అనంతరం సమ్మక్క, సారలమ్మ, పగిడిద్దరాజు, గోవిందరాజుల గద్దెలను దర్శించుకున్నారు. పూలు, పండ్లు, పసుపు, కుంకుమ, చీరెసారె, కొబ్బరికాయలు, బెల్లం (బంగారం) సమర్పించి ప్రత్యేక పూజలు చేశారు. చల్లగా చూడాలని మొక్కుకున్నారు.

» మహా జాతర నేపథ్యంలో మేడారంలో చేపట్టిన పలు అభివృద్ధి పనుల్లో నాణ్యతా ప్రమాణాలు పాటించాలని ఏటూరునాగారం ఐటీడీఏ పీవో అంకిత్, ఓఎస్డీ అశోక్‌కుమార్ అధికారులను ఆదేశించారు. మేడారంలో భక్తుల సౌకర్యార్థం జరుగుతున్న అభివృద్ధి పనులను శుక్రవారం వారు పరిశీలించారు. జంపన్నవాగు వద్ద స్నానఘట్టాలు, తాత్కాలిక మరుగుదొడ్లు, పార్కింగ్ స్థలాలు, చిలకలగుట్ట వద్ద చేపట్టినపనులను, తాగునీటి ఏర్పాట్లను పరిశీలించారు.

» మహా జాతర నేపథ్యంలో మీడియా లైవ్ ల కోసం మీడియా పాయింట్ ఏర్పాటునకు ములుగు కలెక్టర్ త్రిపాఠి శుక్రవారం స్థలపరిశీలించారు. ప్రస్తుత మీడియా పాయింట్ రద్దీగా మారుతుండడంతో పక్కనే ప్రాకారం అంచున మరో భవనం నిర్మించనున్నారు. ఈ భవనానికి మరోపక్క పూజారుల రహస్య పూజా మందిరం ఉండడంతో వారు అభ్యంతరాలు తెలుపుతున్నారు.



రామా శ్రీనివాస్‌కు నివాళులర్పిస్తున్న పద్మశాలీలు

'శ్రీనివాస్ సేవలు మరువలేనివి'

వరంగల్ కలెక్టరేట్, జనవరి 12: రామా శ్రీనివాస్ చేసిన సేవలు మరువలేనివని వరల్డ్ పద్మశాలీ కమిటీ (డబ్ల్యూపీసీ) సభ్యుడు కూరపాటి సుదర్శన్ అన్నారు. శుక్రవారం నగరంలోని చార్‌బౌళిలోని పద్మశాలి కమ్యూనిటీ హాల్‌లో వ్యాపారవేత్త, సామాజిక సేవకుడు రామా శ్రీనివాస్ సంతాప సభను నిర్వహించారు. కార్యక్రమంలో పద్మశాలీలు ఎక్కలదేవి రమేష్, దుస్స శివశంకర్, వెల్దండి వాణి, వంగరి రవి, సాంబారి ప్రభాకర్, బిట్ల రవీందర్, వంగరి సూర్యనారాయణ, వంగరి జయప్రకాష్, గుండా చంద్రమౌళి, దేవులపెల్లి రాజే శ్వర్‌రావు, కె.భాస్కర్, సృజన, రోజా, కవిత పాల్గొన్నారు.

శబరిమలకు బైలెల్లిన స్వాములు

వరంగల్ కలెక్టరేట్, జనవరి 12:మండలం రోజులు నియమ నిష్ఠలతో అయ్యప్ప దీక్ష చేసిన మాలధారులు ఇరుముడితో శబరిమలకి శుక్రవారం పయనమయ్యారు. శ్రీకృష్ణాకాలనీలో పోలా ఉమహేశ్వర్ గురుస్వామి ఆధ్వర్యంలో వంద మంది మాలధారులు ప్రత్యేక పూజల్లో పాల్గొని ఇరుముడులు కట్టుకొని శబరి యాత్రకు బయల్దేరారు. స్వాములకు చెందిన కుటుంబ సభ్యులు పెద్ద సంఖ్యలో హాజరు కాగా దాదాపు 500 మంది భోజనం భిక్ష ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో ఇరుకుళ్ల రమేష్, పోలా ధనంజయ్, రేగూరి మన్మోహన్ పాల్గొన్నారు.

'సంఘ సభ్యులకు అండగా ఉంటున్నాం..'



సభ్యులకు గోల్డ్ కాయిన్ అందిస్తున్న కమిటీ

సంగెం, జనవరి 12: సంఘంలోని సభ్యులకు ఆర్థికసాయం అందిస్తున్నట్లు శ్రీలక్ష్మి గణపతి పరపతి సంఘం ప్రతినిధులు తెలిపారు. శుక్రవారం ఎల్గూరు రంగేపేటలోని సంఘ కార్యాలయంలో సభ్యులను లక్కీడీప్ ద్వారా ఎంపిక చేసిన 80మంది సభ్యులకు పది గ్రాముల బంగారంను అందజేశారు. కార్యక్రమంలో సంఘం అధ్యక్ష, కార్యదర్శులు జనగాం శ్రీనివాస్, ఎర్రబాక శ్రీనివాస్, శాశ్వత సభ్యుడు జనగాం మల్లికార్జున్, జనగాం రమేష్, శాబోతు శ్రీనివాస్, బందేల మల్లేశ్, సంబరాజు అజయ్, సభ్యులు ఎం.అనిల్, మండల రాజేందర్, కోశాధికారి వడ్లకొండ శ్రవణ్ పాల్గొన్నారు.

మృతుడి కుటుంబానికి 'చల్లా' పరామర్శ

సంగెం, జనవరి 12: సంగెం సొసైటీ చైర్మన్ వేల్పుల కుమారస్వామి యాదవ్ తండ్రి మృతి చెందడంతో మృతుడి కుటుంబాన్ని పరకాల మాజీ ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డి పరామర్శించారు. గురువారం రాత్రి తిమ్మాపురంలో చైర్మన్ తండ్రి చేరాలు మృతి చెందగా, శుక్రవారం వెళ్లి మృతదేహానికి నివాళులర్పించారు. కార్యక్రమంలో సర్పంచ్ గన్ను శారద, వైస్ ఎంపీపీ బుక్క మల్లయ్య తదితరులు పాల్గొన్నారు.

• గీసుగొండ: గొర్రెకుంటకు చెందిన కోల లక్ష్మి ఇటీవల అనారోగ్యంతో మృతిచెందగా, మాజీ ఎమ్మెల్యే ధర్మారెడ్డి శుక్రవారం ఆ కుటుంబాన్ని పరామర్శించారు. అలాగే, ఇదే గ్రామానికి చెందిన పాలకుర్తి వేణు సంవత్సరికానికి హాజరయ్యారు. ఆయన వెంట నాయకులు సుంకరి శివ, కందుల శ్రీనివాస్‌రెడ్డి పాల్గొన్నారు.

లోక్‌సభ ఎన్నికలకు సిద్ధం కావాలి



మాట్లాడుతున్న అడిషనల్ కలెక్టర్ అశ్విని తనాజీ వాకడే

వర్ధన్నపేట, జనవరి 12 : రాబోయే లోక్‌సభ ఎన్నికలకు అధికారులు ఇప్పటి నుంచే సన్నద్ధం కావాలని వరంగల్ జిల్లా అడిషనల్ కలెక్టర్ అశ్విని తనాజీ వాకడే సూచించారు. శుక్రవారం వర్ధన్నపేట తహసీల్దార్ కార్యాలయంలో లోక్‌సభ ఎన్నికలపై సన్నాహక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా అడిషనల్ కలెక్టర్ అశ్విని తనాజీ వాకడే మాట్లాడుతున్న వర్ధన్నపేట నియోజకవర్గ పరిధిలో ఉన్న సమస్యాత్మక పోలింగ్ స్టేషన్ల వివరాలు అడిగి తెలుసుకున్నారు. పోలింగ్ కేంద్రాలలో మౌలిక వసతులు కల్పించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. సన్నాహక సమావేశంలో వర్ధన్నపేట తహసీల్దార్ విజయసాగర్, మామునూరు ఏసీపీ సతీష్‌బాబు, వర్ధన్నపేట సీఐ శ్రీనివాస్, వివిధ శాఖల అధికారులు, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

మద్ది మేడారంలో సౌకర్యాలను కల్పించాలి

• నర్సంపేట ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డి



రైతులు, అధికారులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే, కలెక్టర్

నల్లబెల్లి, జనవరి 12: మండలంలోని మద్ది మేడారానికి వచ్చే ప్రజలకు సమగ్ర సౌకర్యాలను కల్పించాలని కాంగ్రెస్ పార్టీ నర్సంపేట ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డి అన్నారు. శుక్రవారం కలెక్టర్ ప్రావీణ్యతో కలిసి ఎమ్మెల్యే మద్ది మేడారానికి చేరుకొని, సమ్మక్క, సారలమ్మలను దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం జరిగిన సమీక్ష సమావేశంలో ఎమ్మెల్యే, కలెక్టర్‌లు మాట్లాడుతూ..మద్దిమేడారానికి ప్రధానంగా రోడ్డు సమస్య, పార్కింగ్ సమస్య ఉందని, ఇందుకోసం విశాలమైన రోడ్డును ప్రత్యేక గ్రాంట్ నిధుల ద్వారా ఏర్పాటు చేస్తామన్నారు. జాతరకు వచ్చే భక్తులకు ఎలాంటి సమస్యలు తలెత్తకుండా ఆరోగ్యశాఖ, పోలీస్ శాఖ, పంచాయతీశాఖ, విద్యుత్‌శాఖ తదితర శాఖల అధికారులకు వారు సూచనలు చేశారు. కార్యక్రమంలో ఈస్ట్ జోన్ డీసీపీ రవీందర్, ఆర్డీవో కృష్ణవేణి, ఏసీపీ తిరుమల్, తహసీల్దార్ రాజేష్, ఎస్సై నాగేష్, ఎంపీడీవో విజయ్‌కుమార్, సర్పంచ్ గోనె శ్రీదేవి, నాయకులు చిట్యాల తిరుపతిరెడ్డి, సీతారాంరెడ్డి, మాలోతు రమేష్, వైనాల అశోక్, మాలోతు చరణ్‌సింగ్, పెంతల కొమురరెడ్డి, ఉపేందర్‌రెడ్డి, పురుషోత్తం సురేష్ తదితరులు పాల్గొన్నారు.

క్రీడలతో మానసిక ఉల్లాసం

దుగ్గొండి, జనవరి 12 : క్రీడలతో మానసిక ఉల్లాసంతో పాటు సమైక్యత భావం పెరుగుతుందని ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డి అన్నారు. మండలంలోని గిర్నిబావిలో గరుడ యూత్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన మండల స్థాయి కబడ్డీ, బాల్ బ్యాడ్మింటన్ క్రీడలను శుక్రవారం ఎమ్మెల్యే మాధవరెడ్డి ప్రారంభించి, మాట్లాడారు. గ్రామీణ ప్రాంతంలో క్రీడల నిర్వహణతో క్రీడాకారుల ప్రతిభను గుర్తించడం జరుగుతుందన్నారు. క్రీడలలో గెలుపు ఓటములు స్ఫూర్తిగా తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ కూస మమత, ఎస్సై పరమేశ్, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు తోకల శ్రీనివాస్ రెడ్డి, డివిజన్ కన్వీనర్ తక్కళ్లపెల్లి రవీందర్‌రావు, ఎర్రెల బాబు, రతన్, సాంబయ్య నిర్వాహకులు, క్రీడాకారులు పాల్గొన్నారు.

కోరిన కోర్కెలు తీర్చే శ్రీచెన్నకేశవస్వామి

• నేటి నుంచి జాతర ప్రారంభం

• లింగగిరిలో ఏర్పాట్లు పూర్తి చేసిన పాలకులు. అధికారులు



లింగగిరిలో గుట్టపై నిర్మించిన ఆలయం (ఇన్‌సెట్‌లో) ఆలయంలో స్వామివారి విగ్రహాలు



ముడుపులు చెల్లించే లక్ష్మిదేవి గద్దె

చెన్నారావుపేట జనవరి 12 : మండలంలోని లింగిగిరిలోని పెద్దగుట్టపై వెలిసిన శ్రీచెన్నకేశవ స్వామి జాతర నేటి నుంచి నాలుగు రోజల పాటు వైభవంగా నిర్వహించనున్నారు. కోరిన వారి కోర్కెలు స్వామి వారు తీర్చుతాడనే విశ్వాసం భక్తులకు ఉంది. శ్రీదేవి, భూదేవి సమేతంగా పెద్ద గుట్ట సొరంగంలో నాలుగు వేల సంవత్సరం కిందట వెలిశాడు. గ్రామానికి చెందిన శ్రీమంతుడు దొడ్డ మోహన్‌రావు సహాయంతో రూ. 2 కోట్లతో గుట్టపైన నూతన ఆలయాన్ని నిర్మించారు. ప్రతీ సంవత్సరం సంక్రాంతి పర్వదినంగా సందర్భంగా నాలుగు రోజుల పాటు జాతరను ఘనంగా నిర్వహిస్తారు. డిసెంబర్ 16నుంచి జనవరి 16వరకు స్వామి వారికి ప్రత్యేక పూజలను నిర్వహిస్తారు. స్వామి ఎదుట ఉన్న గద్దెకు ముడుపులు చెల్లిస్తారు. కోరిన కోర్కెలు తీరుతాయని,సంతానంలేని వారికి సంతానం కలుగుతుందని భక్తుల నమ్మకం. సంక్రాం తి పర్వదినంగా నిర్వహించనున్న ఉత్సవాల్లో భాగం గా ఈ నెల 13వ తేదిన 8వ వార్షికోత్సవము, గణపతి పూజా, పుణ్యావాచనము, స్వామి అభిషేకము, 14న గోదాదేవి కల్యాణోత్సవం, 15న మహాజాతర, నృత్యకళాకారు ల నాట్య ప్రదర్శన. ప్రభ బండ్ల ప్రదర్శన, 16న స్వామి ఊరేగింపు కార్యక్రమాలను నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ తెలిపింది. ఈ జాతరకు చుట్టు ప్రక్కల మండలాల ప్రజలు, సుదూర ప్రాంతాల నుంచి పెద్ద ఎత్తున భక్తులు వచ్చి తమ మొక్కులను చెల్లించుకుంటారు.

• జాతర కోసం ఏర్పాట్లు పూర్తి..

శ్రీచెన్నకేశవ స్వామి జాతరకోసం ఏర్పాట్లను పూర్తి చేసినట్లు ఆలయ నిర్వహణ కమిటీ చైర్మన్ ఆలయ నిర్మాణ దాత దొడ్డ మోహన్‌రావు. సర్పంచ్ మాదా రావు భాస్కర్ తెలిపారు. జాతరకు వస్తున్న వివిధ మండలాలకు చెందిన భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కల్గకుండా తాగు నీరు, దుకాణ సదుపాయాలను ప్రత్యేక ఏర్పాట్లు చేసినట్లు తెలిపారు. గుట్టపై సౌండ్స్, లైటింగ్‌లను ఏర్పాటు చేశామన్నారు. అలాగే ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరుగకుండా ఎస్సై పస్తం శ్రీనువాస్ పోలీస్ సిబ్బందిని నియమించినట్లు తెలిపారు. జాతరలో ప్రభబండ్లను ప్రదర్శించరాదని సూచించారు. జాతరలో భక్తుల కోసం ప్రత్యేక వసతి గృహాలను నిర్మించారు. ఈ సంవత్సరం గుట్టపైన, కింద సీసీ కెమెరాలను ఏర్పాటు చేశారు. అలాగే భక్తులకు ఇబ్బందులు కలుగకుండా వలంటీర్లను నియమిస్తున్నామని తెలిపారు.

• ప్రతి యేటా వైభవంగా జాతరను నిర్వహిస్తాం

సముద్రాల సుదర్శనచార్యులు, అర్చకుడు



ప్రతీ సంవత్సరం సంక్రాంతి పండుగను పుస్కరించుకొని లింగగిరి గుట్టపై శ్రీలక్ష్మీచెన్నకేశవస్వామి జాతర అత్యంత వైభవంగా నిర్వహిస్తాం. ఈ జాతర కు వేలాది మంది భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చి స్వామి వారికి మొక్కులు చెల్లించుకుంటారు. జాతర లో స్వామి వారికి నాలుగు రోజుల పాటు ప్రత్యేక పూజలు నిర్వహించటంతో పాటు, ప్రత్యేక కార్యక్రమాలను చేపట్టడం జరుగుతుంది. భక్తులందరూ అన్ని విధాలుగా సహకారించి స్వామి వారికి మొక్కులను చెల్లించుకోవాలి. మూడు రోజులు పాటు జాతరకు వచ్చే భక్తులకు ఇబ్బందులు లేకుండా చూస్తున్నాం.

• జాతరకు రాజకీయ నాయకులు సహకరించాలి

సీఐ హతీరాం నాయక్

మండలంలోని లింగగిరి గ్రామంలో నేటినుంచి నాలుగు రోజులు నిర్వహించనున్న చెన్నకేశవస్వామి జాతరకు ప్రజలు, రాజకీయ పక్ష నాయకులందరూ సహకరించాలని నెక్కొండ సర్కిల్ సీఐ హతీరాంనాయక్ అన్నారు. శుక్రవారం గ్రామంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. జాతరకు వచ్చే భక్తులు ఎలాంటి మత్తుపదార్థలు తీసుకొనిరావద్దన్నారు. మహిళ పట్ల అసభ్యంగా ప్రవర్తించినా చట్టపరమైన చర్యలు తీసుకోబడతాయని అన్నారు. గ్రామస్థులందరూ జాతరను విజయవంతం చేయాలని, ఎలాంటి గొడవలు, అల్లర్లులకు దిగరాదన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్సై శ్రీనువాస్, సర్పంచ్ మాదారావు భాస్కర్, ఉప సర్పంచ్ రాజశేఖర్, సొసైటీ చైర్మన్ గంట దామోదర్‌రెడ్డి, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

స్వామి వివేకానందను ఆదర్శంగా తీసుకోవాలి



నర్సంపేటలో వివేకానంద జయంతిని నిర్వహిస్తున్న యువజన సంఘాలు

నర్సంపేట టౌన్, జనవరి 12 : నర్సంపేట డివిజన్‌లో స్వామి వివేకానంద జయంతి, జాతీయ యువజన దినోత్సవ వేడుకలను శుక్రవారం వివిధ పాఠశాలలు, కళాశాలలు, యువజన సంఘాల ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఇందులో భాగంగా నర్సంపేట మండలం బిట్స్ కళాశాలలో నెహ్రూ యువ కేంద్రం, ఎన్ఎస్ఎస్ ఆధ్వర్యంలో నేషనల్ రోడ్ సేఫ్టీవీక్‌లో భాగంగా విద్యార్థులకు, యువతకు రోడ్డు భద్రత నియమాలపై అవగాహన, శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు.నాసిక్‌లో జరుగుతున్న యూత్ ఫెస్టివల్‌లో ప్రధాని నరేంద్రమోడీ సందేశాన్ని లైవ్‌లో వీక్షించారు. ఈ కార్యక్రమంలో బిట్స్ కళాశాల ప్రిన్సిపాల్స్ వీఎస్ హరిహరన్, శ్యామ్‌సుందర్, సంపత్, భానురేఖ, నారాయణ, ఫణీంద్ర పాల్గొన్నారు. అలాగే పట్టణంలోని లీడ్ ఫౌండేషన్ వ్యవస్థాపకుడు కాసుల రవికుమార్ ఆధ్వర్యంలో వివేకానంద సందేశాన్ని కరపత్రాల రూపంలో పొందుపరిచారు. ఈ కరపత్రాలను స్థానిక ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డి ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఆవిష్కరించారు. కార్యక్రమంలో లీడ్ ఫౌండేషన్ నిర్వా హకురాలు కాసుల శోభారాణి తదితరులు పాల్గొన్నారు. అదేవిధంగా యువసేన ఫౌండేషన్ ఆధ్వర్యంలో స్వామి వివేకానంద జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో ఫౌండేషన్ వ్యవస్థాపకుడు శివకోటి తదితరులు పాల్గొన్నారు.

పట్టణంలోని బీజేపీ కార్యాలయంలో జాతీయ యువ దివస్ కార్యక్రమాన్ని జిల్లా పార్టీ ప్రధాన కార్యదర్శి రేసు శ్రీనివాస్, ఉపాధ్యక్షుడు కంభంపాటి ప్రతాప్, నియోజకవర్గ ఇన్‌చార్జి నర్సింహరాములు ఆధ్వర్యంలో నిర్వహించారు. పట్టణంలోని యువజన సంఘాల ఆధ్వర్యంలో అంబేద్కర్‌సెంటర్‌లో స్వామి వివేకానంద జయంతి వేడుకలను నిర్వహించారు. కార్యక్రమంలో ఆబోతు రాజుయాదవ్, సుదర్శన్, ప్రభాకర్, ప్రణయ్ దీప్ తదితరులు పాల్గొన్నారు.

• వర్ధన్నపేట : యువత స్వామి వివేకానందను ఆదర్శంగా తీసుకోవాలని వర్ధన్నపేట ఎస్సై ప్రవీణ్ కుమార్ అన్నారు. వివేకానందుని జయంతిని పురస్కరించుకొని వర్ధన్నపేట పట్టణంలోని వివేకానం ద విగ్రహానికి పూలమాలలువేసి ఘనంగా నివాళుల ర్పించారు.ఎస్సై మాట్లాడుతూ భారతదేశ ఔన్నత్యాన్ని ప్రపంచ దేశాల్లో చాటిచెప్పిన ఘనత వివేకానందుడి దన్నారు. భారతదేశ యువతలో వివేకానంద పలుకులు ఎన్నటికి స్ఫూర్తిని నింపుతాయన్నారు. ఈ కార్య క్రమంలో యువకులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

• పర్వతగిరి: వివేకానందస్వామి 162వ జయంతి వేడుకలను మండలంలోని ఆయా గ్రామాల్లో ఘనంగా నిర్వహించారు. మండల కేంద్రంలోని విజ్‌డమ్ పాఠశాలలో వివేకానందస్వామి చిత్రపటానికి ప్రిన్సిపాల్ అనుమాండ్ల దేవేందర్, లయన్స్‌క్లబ్ ఆధ్వర్యంలో మండల అధ్యక్షుడు చిదురాల వేణుగోపాల్ పూలమాలలువేసి ఘనంగా నివాళులర్పించారు. అన్నారం షరీఫ్‌లో వివేకానంద సేవా సమితి అధ్యక్షుడు చేబెల్లి మహేందర్ వివేకానంద విగ్రహానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో సుధాకర్, రాము, దయాకర్, గొల్లపెల్లి సంతోష్, చెలుకలపెల్లి జంపయ్య, సాయిరాం, ప్రశాంత్, అఖిల్, అజయ్, బాబు తదితరులు పాల్గొన్నారు.

• దుగ్గొండి : మండల కేంద్రంలో వివేకానంద గ్రాడ్యుయేట్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో స్వామి వివేకానంద జయంతి వేడుకలు శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అసోసియేషన్ అధ్యక్షుడు అసిస్టెంట్ ప్రొఫెసర్ పెంచాల శ్రీనివాస్ స్వామి వివేకానంద విగ్రహానికి పూలమాల వేసి నివాళుల ర్పించారు. అనంతరం స్వీట్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో సంఘం కార్యదర్శి దుద్దుల రాజేష్, ఉపాధ్యక్షుడు చొప్పరి శోభన్, మల్లంపల్లి సర్పంచ్ చుక్క రమేశ్, బొటికె సంజీవ, రవి, చెన్నమల్లు, అనిల్ తదితరులు పాల్గొన్నారు.

• ఖానాపురం : జాతీయ యువజన దినోత్సవంలో భాగంగా ఖానాపురంలో ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో త్రిపురనేని హేమంత్ ఆధ్వర్యంలో ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఎన్ఎస్ఎస్ ఆధ్వర్యంలో, ధర్మరావుపేటలో శ్రీచైతన్య యూత్ అసోసియేషన్ ఆధ్వర్యంలో స్వామి వివేకానంద జయంతి వేడుకలను శుక్రవారం ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో ఎంపీటీసీ బల్గూరి విజాకర్‌రావు, జూని యర్ కాలేజీ ప్రిన్సిపాల్ ఆరుట్ల శేషాచారి, నిమ్మగడ్డ బిక్కుచౌదరి, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు శాఖమూరి హరిబాబు, ఎన్ఎస్ఎస్ పీవో సదానందం, ఉపాధ్యాయులు నాయుడు, మల్లయ్య, శ్రీచైతన్య యూత్ అసోసియేషన్ అధ్యక్షుడు చేవెళ్ల రాజశేఖర్, తోట రవి, ఓడపల్లి సునిల్ తదితరులు పాల్గొన్నారు.

• చెన్నారావుపేట : మండలంలోని పలు గ్రామాల్లో స్వామి వివేకానంద జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. మండల కేంద్రంలోని స్వామి వివేకానంద విగ్రహానికి బీజేపీ జిల్లా నాయకులు వనపర్తి మల్లయ్య, ఐకేపీ కార్యాలయంలో ఏపీఎం ఈశ్వరయ్య స్వామి వివేకానంద విగ్రహాలకు పూల మాల వేసి నివాళులర్పించారు. వారు మాట్లాడుతూ యువత స్వామి వివేకానందను ఆదర్శంగా తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ఏఈవో స్మీతీ, కట్టయ్య, మంజుల, సుజాత, శ్రీలత, రజిత పాల్గొన్నారు.

• వర్ధన్నపేట రూరల్ : మండలంలోని ఇల్లందలో వివేకానందుని జయంతి సందర్భంగా అంబేద్కర్ యువజన సంఘం ఆధ్వర్యంలో రక్తదాన శిబిరాన్ని ఏర్పాటు చేశారు. రెడ్ క్రాస్ సొసైటీ నిర్వహణలో జరిగిన శిబిరాన్ని వర్ధన్నపేట ఎస్సై ప్రవీణ్‌కుమార్, యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా మేనేజర్ ఇస్లావత్ నరేష్‌లు ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ యువకులు రక్తదాన శిబిరం ఏర్పాటు చేయడం సంతోషంగా ఉందన్నారు. ఇతరులకు ప్రాణం పోసే రక్తాన్ని దానంగా ఇవ్వడం మరొకరి ప్రాణాలు కాపా డిన వారవుతారని స్పష్టంచేశారు. ఈ కార్యక్రమంలో పీఏసీఎస్ చైర్మన్ రాజేష్ కన్నా, ఎంపీటీసీ గొడిశాల శ్రీనివాస్, సామాజిక కార్యకర్త మోడెం కుమార స్వామి, యువజనసంఘం సభ్యులు జోగుల సంపత్, తాండ్ర రాజేందర్, శ్రీకాంత్, నాగరాజు, సంతు, రాకేష్ తదితరులు పాల్గొన్నారు.

తెలంగాణ ఉద్యమకారులను ప్రభుత్వం ఆదుకోవాలి



సమావేశంలో మాట్లాడుతున్న జ్యోతిరెడ్డి

నెక్కొండ, జనవరి 12 : రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెడుతున్న సంక్షేమ పథకాల్లో తెలంగాణ ఉద్యమకారులకు ప్రాధాన్యత కల్పించాలని తెలంగాణ ఉద్యమకారుల ఫోరం రాష్ట్ర నాయకురాలు జ్యోతిరెడ్డి కోరారు. నెక్కొండలోని అంబేద్కర్ భవనంలో శుక్రవారం జరిగిన సమావేశంలో ఆమె మాట్లాడుతూ ప్రజాపాలన దరఖాస్తుల్లో తెలంగాణ ఉద్యమకారులకు ప్రాధాన్యతను కల్పించిన ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. నిజమైన ఉద్యమ కారులను గుర్తించి 250 గజాల ఇంటి స్థలం, జీవనోపాధికి గాను వ్యాపారం కొరకు వడ్డీ లేని రుణాలను, బస్సుల్లో ఉచిత ప్రయాణ సౌకర్యం కల్పించాలన్నారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ ఉద్యమకారులు డాక్టర్ ఈదునూరి వెంకటేశ్వర్లు, కొనిజేటి భిక్షపతి, కొత్త సంపత్‌రెడ్డి, కత్తుల సదానందం, శాడ అనితారెడ్డి, సరితారెడ్డి, అల్లి యాదగిరి, ముదుసు కొమ్మాలు, తాళ్లూరి తిరుపతి, బండారి రమేశ్, కందిక వెంకన్న, మాదాసు యాకయ్య తదితరులు పాల్గొన్నారు.

తెగుళ్లతో నష్టపోయిన మిర్చి రైతులను ఆదుకోవాలి



మిర్చి తోటను పరిశీలిస్తున్న బీఆర్ఎస్ నాయకులు

నర్సంపేట టౌన్, జనవరి 12 : మండలంలోని భాంజిపేట, మాధన్నపేట గ్రామాల్లో బీఆర్ఎస్ మండల కమిటీ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు నామాల సత్యనారాయణ, ఈర్ల నర్సింహరాములు ఆధ్వర్యంలో శుక్రవారం వైరస్ తెగుళ్ల మిర్చి తోటలను సందర్శించారు. వారు మాట్లాడుతూ పూతకొచ్చే దశలో మిర్చికి వైరస్ తెగుళ్లతో పంట దెబ్బతిన్నదని ఆవేదన వ్యక్తం చేశారు. వ్యవసాయ అధికారులు సర్వేచేయించి నష్టపోయిన రైతులకు నష్టపరిహారం ఇప్పించి ఆదుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో స్వామి, సంపత్‌రెడ్డి, సాంబయ్య, మల్లికార్జున్, కుమార్ పాల్గొన్నారు.

• నల్లబెల్లి : మండలంలోని పంట నష్టపోయిన మిర్చి రైతులను ప్రభుత్వం ఆదుకోవాలని బీఆర్ఎస్ మండల పార్టీ అధ్యక్షుడు బానోతు సారంగపాణి అన్నారు. ఈ మేరకు మండలంలోని రంగాపురం, నంది గామ, రేలకుంట, ముచ్చింపులలో మిర్చి పంటలను శుక్రవారం పరిశీలించి, మాట్లాడారు. మిర్చి పంటకు ప్రధానంగా తెగుళ్లతో కూడిన సమస్య ఆకు ముడుత, మధ్య తెగులు, నల్ల తామర వంటి వైరస్‌లతో మిర్చి పంట పూర్తిగా దెబ్బతింటుందన్నారు. లక్షల వ్యయంతో మిర్చి పంటకు అప్పులు తెచ్చి మరి పెట్టుబడి పెట్టామని రైతులు వాపోతున్నారన్నారు. ప్రభుత్వం మిర్చి రైతులను ఆదుకోవాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు పాలెపు రాజేశ్వర్‌రావు, ఊడుగుల ప్రవీణ్, కక్కెర్ల శ్రీనివాస్, గందె శ్రీనివాస్ గుప్తా, మాలోతు ప్రతాప్‌సింగ్, ఇంగ్లీ శివాజీ, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు తదితరులు పాల్గొన్నారు.

• దుగ్గొండి : వివిధ రకాల తెగుళ్ల కారణంగా రైతులు సాగు చేసిన మిరప పంటలకు నష్టంవాటిల్లిందని, వెంటనే ప్రభుత్వం పంటలు సర్వే చేసి నష్ట పరిహారం చెల్లించాలని నర్సంపేట మార్కెట్ డైరెక్టర్ బీఆర్ఎస్ మండల ఉపాధ్యక్షుడు తోటకూరి రాజు డిమాండ్ చేశారు. మండలంలోని తిమ్మంపేటలో తెగుళ్లు సోకిన మిరప పంటలను శుక్రవారం బీఆర్ఎస్ ఆధ్వర్యంలో పరిశీలన చేశారు. రాజు మాట్లాడుతూ మిరప పంటలు సాగు చేసిన రైతులు తెగుళ్లసోకి ఆర్థికంగా నష్టపోయారని, ఎకరానికి రూ.లక్ష నష్ట పరిహారం చెల్లించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో గ్రామ బీఆర్ఎస్ అధ్యక్షుడు గొర్రె జనార్ధన్‌రెడ్డి, అనుమాండ్ల సమ్మిరెడ్డి, ఎలకంటి కుమార స్వామి, బీరం ప్రభాకర్‌రెడ్డి, తోటకూరి సదయ్య, ఐలయ్య, కడారి రాజు, అశోక్, గిన్నెభాస్కర్, మేక రాజు తదితరులు పాల్గొన్నారు.

మృత్యు పాశాలు..!

• సరిచేయని విద్యుత్ అధికారులు



కొత్తపెల్లిలో కిందికి వేలాడుతున్న విద్యుత్ తీగలు

వర్ధన్నపేట రూరల్, జనవరి 12 : వ్యవసాయ పొలాల మీదుగా వెళ్లే విద్యుత్ తీగలు రైతుల పాలిట మృత్యు పాశాలుగా దర్శనమిస్తున్నాయి. కొత్తపెల్లిలోని వ్యవసాయం పొలం నుంచి వెళ్తున్న 11కేవీ విద్యుత్ తీగలు ప్రమాదకరంగా ఉన్నాయి. రైతులు ప్రస్తుతం నారు పోసుకుని నాట్లు వేసేందుకు సిద్ధంగా ఉన్నారు. ఈ తరుణంలో విద్యుత్ తీగలు వేలాడుతూ ఉండడం వలన విద్యుత్ షాక్ తగిలే ప్రమాదం ఉంది. సమస్యను స్థానిక రైతులు అధికారులకు సమాచారం అందించినా పట్టించుకోవడంలేదని ఆరోపిస్తున్నారు. చేయి ఎత్తితే తగిలే ఎత్తులోనే విద్యుత్ తీగలు ఉండడంతో అటు వైపుగా వెళ్లాలంటే భయంగా ఉందని చెపుతున్నారు. రాత్రి వేళల్లో ఏమరపాటుతో వెళితే ప్రమాదం జరిగే అవకాశం ఉందని, మూగజీవాలు సంచరించిన మృత్యువాత పడే అవకాశాలు ఉన్నాయని వాపోతున్నారు.

• విద్యుత్ అధికారులు పట్టించుకోవడం లేదు..

దేవరాజు, రైతు, కొత్తపెల్లి



వేలాడుతున్న విద్యుత్ తీగల సమస్యపై చాలా సార్లు విద్యుత్ అధికారులకు సమాచారం ఇచ్చాను. కానీ ఎలాంటి స్పందనలేదు. ప్రమాదం జరిగే ప్రాణాలు పోతాయని చెప్పిన పట్టించుకోవడం లేదు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు సమస్యను పరిష్కరిం చేందుకు చొరవ చూపాలి.

నల్లబెల్లిలో శ్రీరాముడి శోభాయాత్ర

నల్లబెల్లి, జనవరి 12 : మండల కేంద్రంలో శ్రీరాముడి శోభాయాత్రను శ్రీరామ జన్మభూమి తీర్థ ట్రస్ట్ ఆధ్వర్యంలో శుక్రవారం వైభవంగా నిర్వహించారు. అనంతరం రామాలయం వద్ద హనుమాన్ దేవాలయం వరకు భక్తులు, గ్రామస్థులు డప్పు చప్పులతో శ్రీరామ నామస్మరణం చేసుకుంటూ అంగరంగ వైభవంగా శ్రీరాముడి శోభాయాత్రను నిర్వహించారు. అలాగే భక్తులు ఇంటింటికి అక్షింతలను అందజేశారు. కార్యక్రమంలో సర్పంచ్ నానబోయిన రాజారాం, మండల ట్రస్ట్ బాధ్యులు మార్త మార్కండేయ, అర్చకుడు కృష్ణస్వామి, తడుక వినయ్, సుధాగాని ప్రదీప్, గుమ్మడి వేణు, పాండవుల రాంబాబు, తడుక అశోక్, బత్తిని మహేష్ నీల శ్రీనివాస్, మహిళలు పాల్గొన్నారు.

ఎస్సీ హాస్టల్ ప్రహరీ కూల్చిన వారిపై చర్యలు తీసుకోవాలి

నెక్కొండ, జనవరి 12 : నెక్కొండ మండల కేంద్రంలోని ప్రభుత్వ బాలుర ఎస్సీ హాస్టల్ ప్రహరీ గోడను కూల్చిన చల్లా గోదాముల యాజమాన్యంపై చర్యలు తీసుకోవాలంటూ మండల బీజేపీ నాయకులు డిమాండ్ చేశారు. కూల్చివేసిన ఎస్సీ హాస్టల్ గోడ స్థలాన్ని శుక్రవారం పరిశీలించారు. అనంతరం అక్రమంగా గోడను కూల్చిన వారిపై చర్యలు తీసుకోవాలని ప్రభుత్వాన్ని కోరుతూ తహసీల్దార్ రాజ్ కుమార్‌కు వినతి పత్రాన్ని అందించారు. ఈ కార్యక్రమంలో బీజేపీ జిల్లా నాయకుడు అంబాల రాంగోపాల్, మండల ప్రధాన కార్యదర్శి సొంటిరెడ్డి వేణుగోపాల్‌రెడ్డి, ప్రసాద్, రాపాక సందీప్, సతీష్, రాజు తదితరులు పాల్గొన్నారు.

ఎంపీజే క్యాలెండర్ ఆవిష్కరణ

నర్సంపేట, జనవరి 12 : మూమెంట్ ఫర్ పీస్ అండ్ జస్టిస్(ఎంపీజే) నూతన సంవత్సర క్యాలెండర్‌ను పట్టణంలోని మస్జీద్ ఆవరణలో శుక్రవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా తెలంగాణ జన సమితి జిల్లా అధ్యక్షుడు షేక్ జావెద్ మాట్లాడుతూ మహిళలు వివక్షకు గురికాకుండా ప్రభుత్వం భద్రత కల్పించాలని కోరారు. ఈ కార్యక్రమంలో సందాని, నోమాన్, హర్షత్ పాల్గొన్నారు.

సెల్‌ఫోన్ అప్పగింత

వర్ధన్నపేట, జనవరి 12 : వర్ధన్నపేట పట్టణ కేంద్రానికి చెందిన మహ్మద్ ఇమ్రాన్ నాలుగు రోజుల క్రితం తన మొబైల్ ఫోన్ వర్ధన్నపేట బస్టాండ్ సమీపంలో పోగొట్టుకున్నాడు. ఈ విషయంపై స్థానిక పోలీసులకు ఫిర్యాదు చేయడంతో వారు రూ.30వేల విలువగల ఫోన్‌ను ట్రేస్ చేసి ఇమ్రాన్‌కు వర్ధన్నపేట పోలీసులు అప్పగించారు.

ఆలయ పునర్నిర్మాణానికి విరాళం

పర్వతగిరి, జనవరి 12 : మండలంలోని గోపనపెల్లి గ్రామంలోని దూడెల మల్లికార్జునస్వామి ఆలయ పునర్నిర్మాణానికి గాను పలువురు దాతలు ఆలయ అభివృద్ధి కమిటీ బాధ్యులకు విరాళం అందించారు. గ్రామానికి చెందిన కారింగుల నర్సయ్య - కొమురమ్మ దంపతులు రూ.21,116 శుక్రవారం విరాళంగా అందించారు. కారింగుల సాంబలక్ష్మి జ్ఞాపకార్థం ఆమె భర్త కారింగుల సారంగపాణి, ఆమె కుమారులు అశోక్, రాజు రూ.20,116 విరాళంగా అందించారు. ఈ కార్యక్రమంలో మధుకర్ పాల్గొన్నారు.

ముగ్గుల పోటీ

నర్సంపేట, జనవరి 12 : నర్సంపేట మున్సిఫ్ కోర్టు ఆవరణలో సంక్రాంతి పండుగను పురస్కరించుకొని మహిళ న్యాయవాదులు, సిబ్బందికి బార్ అసోసియేషన్ ఆధ్వ ర్యంలో శుక్రవారం ముగ్గుల పోటీ నిర్వహించారు. ఈ సందర్భంగా మున్సిఫ్‌కోర్టు జడ్జి శిరీష న్యాయవాదులకు సంక్రాంతి పండుగ శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం విజేతలకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో అసోసియేషన్ అధ్యక్షుడు కొమ్ము రమేష్‌యాదవ్, సారంగపాణి, పుట్టపాక రవి, కిరణ్, సాంబయ్య, మోటూరి రవి,రమేష్ పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

చెన్నారావుపేట, జనవరి 12 : మండలంలో ఈ నెల 13న విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని డీఈ భిక్షపతి శుక్రవారం తెలిపారు. నెక్కొండ ఉప కేంద్రంలో విద్యుత్ మరమ్మతు పనులు జరుగుతున్నదున ఉదయం 9 గంటల నుంచి సాయంత్ర 3 గంటల వరకు విద్యుత్ సరఫరాను నిలిపి వేయటం జరుగుతుందన్నారు. వినియోగదారులు సహకరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఏఈ జోగాంద్ తదితరులు పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి పరామర్శ

రాయపర్తి, జనవరి 12 : మండలంలోని కాట్రపెల్లికి చెందిన సర్పంచ్ బోనగిరి ఎల్లయ్య తండ్రి సోమయ్య ఇటీవల అనారోగ్యంతో మృతిచెందగా, శుక్రవారం రాయపర్తి ఎంపీపీ జీనుగు అనిమిరెడ్డి, జడ్పీటీసీ రంగు కుమార్‌లు పరామర్శించారు. మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు ఆదేశాల మేరకు వారి కుటుంబానికి అండగా ఉంటామని హామీ ఇచ్చారు. వీరి వెంట సర్పంచులు గారె నర్సయ్య, లేతాకుల సుమతి యాదవరెడ్డి, గజవెల్లి అనంత ప్రసాద్‌లు ఉన్నారు.